జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

కృష్ణ | బుధవారం 11 నవంబర్ 2026 | సంపుటి : 01 | సంచిక :296 | పేజీలు : 12 | వెల : 3/-

PRGI No. APTEL/26/A0119,

WANTED



గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, ఏజెన్సీ/కరస్పాండెంట్ ఇంచార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967

సంవత్సరం: శ్రీ పరాభవ నామ సంవత్సరం, మాసం: ఆశ్వయుజ మాసం ఋతువు: శరద్ ఋతువు ఆయనం: దక్షిణాయణం విశేషం: అమావాస్య, దీపావళి, నరక చతుర్దశి, లక్ష్మీ పూజాసూర్యోదయం: 6.03 సూర్యాస్తమయం: 5.19 చంద్రోదయం: 5.49 చంద్రాస్తమయం: 4.46 తిథి: బహుళ చతుర్దశి ఉ. 10.26 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: స్వాతి పూర్తిగా ఉంది యోగం: ఆయుష్మాన్ తె. 3.44 వరకు, తదుపరి సౌభాగ్యం కరణం: శకుని ఉ. 10.26 వరకు, తదుపరి చతుష్పాదం రా. 10.43 వరకు, తదుపరి నాగం

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI | http://www.prajajyothinews.com | Mail: prajajyothidaily@gmail.com



వాయు కాలుష్యంలోనూ 'విశ్వగురువు' కావాలా?

- దిల్లీలో విషవాయువులతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు
- 59 కాలుష్య పర్యవేక్షణ కేంద్రాల్లో 36 చోట్ల పీఎం2.5 వివరాలు కనిపించడం లేదని ఖర్గే ఆరోపణ
- కాలుష్య నివారణ నిధుల వినియోగంపై ప్రశ్నలు
- 'హవా కా హిసాబ్' చెప్పాలని ప్రధానికి సవాల్

తిరుపతిలో డిక్సన్ టెక్నాలజీస్‌కు భూ కేటాయింపు



- భారీ పెట్టుబడులకు ఏపీ కేబినెట్ గ్రీన్‌సిగ్నల్!
- ఏఐ డేటా సెంటర్లు, రోబోటిక్స్, సెమీకండక్టర్ రంగాలకు కొత్త విధానాలు
- రూ.31,387 కోట్లతో భీమిలిలో ఏఐ డేటా సెంటర్
- డిక్సన్ యూనిట్‌తో 2,300 మందికి ఉద్యోగాలు
- టీటీడీలో కొత్త పోస్టులు.. విద్యుత్ రంగంలో కీలక నిర్ణయాలు

అమరావతి

రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడం, సాంకేతిక రంగాల్లో కొత్త అవకాశాలను సృష్టించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఐటీ, కృత్రిమ మేధస్సు (ఏఐ), రోబోటిక్స్, సెమీకండక్టర్ రంగాలకు సంబంధించి మూడు కీలక విధానాలకు ఆమోదం తెలిపింది. డేటా సెంటర్ల ఏర్పాటుతో పాటు విద్యుత్, గ్రీన్ ఎనర్జీ, పట్టణాభివృద్ధి, పోలీసు వ్యవస్థలో నూ పలు ప్రతిపాదనలకు పచ్చజెండా ఊపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో 34 అజెండా అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు.

మూడు కీలక విధానాలకు ఆమోదం

2026-31 ఏవీజీసీ-ఎక్స్‌ఆర్ విధానానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 2026-2036 రోబోటిక్స్, ఫిజికల్ ఏఐ విధానానికీ పచ్చజెండా ఊపింది. సెమీకండక్టర్, డిస్‌ప్లే ఫ్యాబ్ పాలసీ 4.0లో సవరణలకు ఆమోదముద్ర వేసింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఈ-ప్యాక్ డేటా సెంటర్ సొల్యూషన్స్ సంస్థ మాడ్యులర్ ఎక్విప్‌మెంట్ తయారీ యూనిట్ ఏర్పాటుకు - మిగతా3లో

తుపాను పోయినా తీరని వరద కష్టాలు



జల దిగ్బంధంలో గోదావరి జిల్లాలు

పశ్చిమ గోదావరి జిల్లాలో గోస్తాని డ్రెయిన్ ఉప్పొంగి ప్రవహిస్తోంది

పెనుమంట్ర మండలం సోమరాజు ఇల్లిందపర్రు గ్రామంలోని పంట పొలాలు ముంపునకు గురయ్యాయి



ప్రపంచ సంక్షోభాల్లో భారత్ వైపే చూపు

- మోదీ నాయకత్వంపై బీజేపీ వ్యాఖ్యలు
- మోదీకి ప్రపంచ నేతల్లో విస్తృత ఆదరణ ఉందన్న బీజేపీ
- గత 12 ఏళ్లలో భారత్ ప్రతిష్ఠ పెరిగిందని వెల్లడి
- విదేశాంగ అంశాలపై జాగ్రత్తగా మాట్లాడాలన్న కాంగ్రెస్
- భారత్-ఉక్రెయిన్ సంబంధాల బలోపేతంపై జెలెన్‌స్కీ-మోదీ చర్చ
- శాంతియుత పరిష్కారానికి సహకరిస్తామని మోదీ హామీ

పీఠాల కోసం కూటమి నేతల పోటాపోటీ!



- ఈ నెల 20న జడ్పీ ఛైర్మన్ల ఎన్నికలు..
- 27 జిల్లాల్లో కూటమికే అధిక్యం
- టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య పదవుల పంపకాలపై చర్చలు
- ఆశావహుల ప్రయత్నాలు ముమ్మరం
- కొన్ని జిల్లాల్లో పేర్లు దాదాపు ఖరారు.. మరికొన్ని చోట్ల తీవ్ర పోటీ

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో జిల్లా పరిషత్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ఈ నెల 20న ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించడంతో అధికార కూటమిలో రాజకీయ సందడి మొదలైంది. ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన కూటమి.. అల్లూరి సీతారామరాజు జిల్లా మినహా మిగిలిన 27 జిల్లాల్లో జడ్పీ ఛైర్‌పర్సన్ పదవులను దక్కించుకునే అవకాశముంది. దీంతో జడ్పీటీసీ సభ్యులుగా గెలిచిన కూటమి నేతలు ఛైర్మన్ పీఠాలపై ఆశలు పెట్టుకున్నారు. పదవుల కోసం తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. పార్టీల మధ్య - మిగతా3లో



అర్నబ్ తుపానుతో భారీ నష్టం

- తుపాన్లతో 4.61 లక్షల హెక్టార్లలో పంట నష్టం..
- వెంటనే నమోదు పూర్తి చేయాలి: అచ్చెన్నాయుడు!
- అర్నబ్, మురసు తుపాన్లతో రైతులకు తీవ్ర నష్టం
- 7.09 లక్షల మందికి పైగా రైతులపై ప్రభావం
- ఉద్యాన పంటల నష్టాల నమోదులో జాప్యంపై మంత్రి అసంతృప్తి
- అర్హులైన ప్రతి రైతుకూ పరిహారం అందిస్తామని హామీ

బ్రిటీష్ కాలం నాటి మానవ అవశేషాలను భారత్‌కు అప్పగించిన ఆక్స్‌ఫర్డ్ మ్యూజియం!



- బ్రిటిష్ కాలంలో ఆక్స్‌ఫర్డ్ మ్యూజియానికి చేరిన నాగాల మానవ అవశేషాలు
- తిరిగి అప్పగించేందుకు అంగీకరించిన మ్యూజియం
- 30 మంది నాగా ప్రతినిధులతో బ్రిటన్‌లో ఒప్పందం
- పురైలతో కూడిన ఈ అవశేషాలు 1910--1940 మధ్య ఆక్స్‌ఫర్డ్‌కు చేరినట్లు అంచనా
- ఒకే స్మారక స్థలం వద్ద గౌరవప్రదంగా సమాధి చేయాలని గిరిజన నాయకుల నిర్ణయం



సముద్ర గర్భంలోకి భారత్ సాహసయాత్ర..

- సముద్రయాన్ ప్రాజెక్టులో భాగంగా 'మత్స్య-6000' జలాంతర్గామిని అభివృద్ధి చేస్తోన్న భారత్
- ముగ్గురు వ్యక్తులను 6 వేల మీటర్ల లోతుకు తీసుకెళ్లేలా దీని రూపకల్పన
- 600 బార్‌ల నీటి ఒత్తిడిని తట్టుకునేలా టైటానియంతో గోళాకార గది నిర్మాణం



మోదీతో పెద్దగా పరిచయం లేదు..

ఎదురుపడినా కళ్లలోకి చూడరు

- కొత్త పుస్తకం 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'లో ప్రధాని మోదీపై వ్యాఖ్యలు
- రాజకీయ ప్రయాణాలు, దేశంపై దృక్పథాలు వేర్వేరని వెల్లడి
- రాజీవ్ గాంధీ హత్యకు సంబంధించిన విషాద జ్ఞాపకాలను పంచుకున్న కాంగ్రెస్ అగ్రనేత

చెన్నూరు పెన్నా నది ఒడ్డున శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మహోత్సవాలు

చెన్నూరు, నవంబర్, 10, చెన్నూరు పెన్నా నది ఒడ్డునవెలసిన శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయంలో ఈనెల పదవ తేదీ నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు కార్తీక మాస ఉత్సవాలు నెలరోజులపాటు ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు, 10 న మంగళవారం తెల్లవారుజామున 4:30 గంటలకు గోపూజ గోవు ఆలయ ప్రదర్శన శాల ప్రవేశం ఉదయం 5 గంటలకు రుద్ర ప్రత్యేక సాధారణ అభిషేకములు సాయంత్రం ఆకాశదీపం ఆవిష్కరణ జరుగుతుంది, ఈ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శ్రీ ఆంజనేయ శర్మ పూజలతో పలూరి సహాయంతో ఆకాశదీపం ఆవిష్కరణ నిర్వహిస్తారు, ఈ దీపం ప్రతిరోజు ఆరు గంటలకు వేద మంత్రములతో దయ స్తంభం పై రాత్రి వెలుగునిస్తూ ఉంటుంది, 14 న శనివారం ఉదయం 9 గంటలకు నుంచి 11 గంటల వరకు కార్తీక నాగపంచమి నాగదేవతలకు అభిషేకం పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు, 15 ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం ఉంటుంది, 16న మొదటి కార్తీక సోమవారం కావడంతో ఉదయం ఆరు గంటల నుంచి 9 గంటల వరకు రుద్ర హోమం నిర్వహిస్తారు, ఉదయం 10 గంటల నుంచి రెండు గంటల వరకు హనుమాన్ చాలీసా శివనామ సంకీర్తన నిర్వహిస్తారు, మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు,17 న మంగళవారం ఉదయం 10 గంటలకు ఇక గోపాష్టమి నిర్వహిస్తారు, శ్రీ కృష్ణుడు మొట్టమొదటిసారి అడవికి ఆవులను తీసుకొని పోయిన రోజు కావడంతో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు, 23 రెండవ కార్తీక సోమవారం ఉదయం అభిషేక పూజలు 9 గంటల నుంచి 12 గంటల వరకు హనుమాన్ చాలీసా శివనామ సంకీర్తన మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు సాయంత్రం శివపార్వతులో పల్లకి సేవ నిర్వహిస్తారు అనంతరం భక్తులకు అల్పాహార ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు, రాత్రి 7 గంటల నుంచి సాంప్రదాయ నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్నారు, 24న మంగళవారం కార్తీక పౌర్ణమి కావడంతో తెల్లవారుజామున 4





గంటలకు కార్తీకదీపం మహోత్సవం నిర్వహిస్తున్నారు, రాత్రి 7 గంటలకు సహస్ర దీపాలంకరణ సేవ స్వామివారు నంది వాహనంపై సేవ ఊరేగింపు ఉంటుంది అలాగే జ్వాలాతోరణం నిర్వహిస్తున్నారు భక్తులకు రాత్రి అల్పాహార ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు, 27న శుక్రవారం ఉదయం తొమ్మిదిన్నర గంటలకు కార్తీక సంఘట హర చతుర్థి నిర్వహిస్తారు, వినాయక స్వామికి ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు, 30వ తేదీన మూడవ కార్తిక సోమవారం ఉదయం 9 గంటలకు కార్తీక బహుళ షష్టి సుబ్రహ్మణ్యం స్వామికి అభిషేక పూజలు నిర్వహిస్తారు, 9 గంటల నుంచి 12 గంటల వరకు హనుమాన్ చాలీసా శివనామ సంకీర్తన మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు సాయంత్రం స్వామివారు సేవ పల్లకి సేవ గంగా హారతి ఏర్పాటు చేశారు, నాలుగున శుక్రవారం ఉదయం 9:30 గంటలకు కార్తీక బహుళ ఏకాదశి సందర్భంగా పార్వతీదేవికి అభిషేక పూజలు నిర్వహిస్తారు, ఆరో తేదీ ఆదివారం ఉదయం కార్తీక బహుళ ద్వాదశి పురస్కరించుకొని నవగ్రహ దేవతలకు ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు, సాయంత్రం సందీదేవులకు ప్రదోషకాల పూజ నిర్వహిస్తారు, ఏడో తేదీ నాలుగవ సోమవారం ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శివపార్వతుల కళ్యాణం మధ్యాహ్నం మహా అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు, సాయంత్రం నాలుగు గంటలకు శివపార్వతులను పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహిస్తారు, ఎనిమిదో తేదీ మంగళవారం కార్తీక అమావాస్య 30 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా రుద్రాభిషేకం భక్తులకు వేద సర్వాదం ఉంటుంది 9 గంటలకు నిలువెత్తున ఉన్న ఆంజనేయ స్వామికి అభిషేక పూజలు నిర్వహిస్తారు, అదే రోజున హనుమాన్ చాలీసా నిర్వహిస్తున్నారు, 9వ తేదీన బుధవారం పోలి పాడ్యమి పురస్కరించుకొని ఉదయం 6 గంటలకు ఆకాశదీపం అవరోహణ(నిమ్రమణ) కార్తీక మాస సమాప్తి దీపం నదిలో వదులుట దీంతో నెలరోజుల పాటు జరిగే కార్తీక మాస ఉత్సవాలు ముగుస్తాయి, రుద్ర హోమము శివ కళ్యాణం గంగా హారతి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలు గౌతమ్ కుమార్ శర్మ మరియు కోడూరు రాజేశ్వర్ కోడూరు రాజేష్ స్వామి నిర్వహిస్తారు, ప్రతిరోజు ఆలయంలో అర్చకులు ఆంజనేయ శర్మ నిర్వహిస్తారు,

డాక్టర్ బాబ్జికి ఘన నివాళులు అర్పించిన రసధుని సాహితీ సంస్థ

పాలకొల్లు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. నవంబర్ 10. ఈ నెల 4న కన్నుమూసిన పాలకొల్లు పట్టణ ప్రముఖ వైద్యులు, మాజీ ఎమ్మెల్యే, సేవా పరాయణులు డాక్టర్ సిహెచ్ సత్యనారాయణమూర్తి (డాక్టర్ బాబ్జి) మృతి పట్ల స్థానిక రసదుని సాహితీ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పెన్షనర్స్ భవనంలో జరిగిన సంతాప సభలో సభ్యులందరూ ఘన నివాళులు అర్పించారు. సభకు అధ్యక్షత వహించిన రసధుని అధ్యక్షులు కొట్టి భాస్కరరావు మాట్లాడుతూ వైద్యరంగంలో నిస్వార్థ వైద్యునిగా పేరొందిన డాక్టర్ బాబ్జి గత 50 సంవత్సరాలుగా వైద్య సేవలు అందిస్తూ వైద్య రంగానికే వన్నె తెచ్చారన్నారు. రసధుని సాహితీ కార్యక్రమాలకు డాక్టర్ బాబ్జి వీలు చూసుకుని హాజరు అయ్యే వారని సాహితీ కార్యక్రమాల పట్ల ఆయన ఆసక్తి కనపర్చేవారని అన్నారు. రసధుని ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి వెంకటరత్నం మాట్లాడుతూ డాక్టర్ బాబ్జి వైద్య సేవలు కొనసాగిస్తూనే రాజకీయ రంగంలో అడిగిడి పాలకొల్లు ఎమ్మెల్యేగా ఐదేళ్లపాటు ప్రజలకు సేవలు అందించారన్నారు. లయన్స్ సేవలతో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థల కార్యక్రమాలలో పాల్గొని డాక్టర్ బాబ్జి సేవా పరాయణుడిగా పేరుపొందారన్నారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వంగా నరసింహారావు మాట్లాడుతూ ట్రాక్టర్ బాబ్జి వైద్య, సామాజిక, రాజకీయ సేవలతోపాటు విద్యా సేవలు అందించారన్నారు. అయన ఏర్పాటు చేసిన డాక్టర్ సభిత జూనియర్ కాలేజీలో చదివిన ఎంతోమంది విద్యార్థులు ఉన్నత విద్యావంతులు



అయ్యారన్నారు. ఉపాధ్యాయుల పట్ల గౌరవభావంతో పాలకొల్లులో ఎంపికచేసిన ఉత్తమ ఉపాధ్యాయులను ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రతి ఏటా సన్మానించేవారన్నారు. రిటైర్డ్ ప్రిన్సిపల్ చేగొండి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ వైద్యులలో అత్యంత ప్రతిభావంతులైన వైధ్యునిగా డాక్టర్ బాబ్జి పేరొందారన్నారు. వైద్యరంగంలో ఇంత సాంకేతిక అభివృద్ధి లేని రోజుల్లోనే డాక్టర్ బాబ్జి చెయ్యి పట్టుకుని వ్యాది లక్షణాలను నిర్ధారించేవారన్నారు. వైద్య రంగాన్ని సేవా ధర్మంగా భావించిన ఆయన ఎందరికో ప్రాణాలు నిలిపి పునర్జన్మ ఇచ్చారన్నారు. డాక్టర్ బాబ్జి లేని లోటు తీర్చలేనిదని అయన పేర్కొన్నారు. అనంతరం మాట్లాడిన వక్తలందరూ డాక్టర్ బాబ్జితో తమకు ఉన్న అనుబంధాన్ని, అయన ప్రతిభను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబ్జి చిత్రపటానికి సభ్యులందరూ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యవర్గ సభ్యులు ర్యాలి విష్ణుమూర్తి కోలాటి పెద్దిరాజు మామిడిశెట్టి శ్రీనివాస్ ముచ్చర్ల వెంకట సత్యనారాయణ చల్లా అన్నపూర్ణేశ్వరరావు జీయస్ యన్ మూర్తి ఇవటూరి వెంకటేశ్వర రావు పి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

అక్రమంగా తరలిపోతున్న అడవి సంపద!

పట్టించుకోని అటవీశాఖ అధికారులు.. సమాచారం ఉన్నా స్పందించని డీఆర్ఓ!

అడ్డదారిలో అవతలి ఒడ్డుకి

అటవీ సంపద అక్రమ రవాణాపై స్థానికుల ఆందోళన.. చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్







కూనవరం నవంబర్ 10, (ప్రజా జ్యోతి ప్రతినిధి కిరణ్ బాబు)అడవులను కాపాడాల్సిన అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా విలువైన అడవి సంపద అక్రమంగా తరలిపోతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అడవుల్లోని విలువైన కలప, ఇతర అటవీ ఉత్పత్తులు అక్రమంగా తరలిపోతున్నట్లు సమాచారం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.అక్రమ రవాణాపై సమాచారం అందించినా స్పందించాల్సిన డీఆర్ఓ తగిన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అటవీ సంపదను కాపాడాల్సిన బాధ్యత కలిగిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అక్రమార్కులకు మరింత అవకాశం కల్పించినట్లవుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి విలువైన ఆదాయం సమకూర్చే అటవీ సంపద యథేచ్ఛగా తరలిపోతుంటే సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ రవాణాపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అటవీ సంపద పరిరక్షణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పాములూరు రైతు సేవా కేంద్రంలో క్షేత్రాన్ని కాపాడుకుందాం కార్యక్రమం



చింత కొమ్మ దిన్నె కె వి కె ప్రజాజ్యోతి 10/11/26 కడప జిల్లా, వేంపల్లి మండలంలోని పాములూరు రైతు సేవా కేంద్రంలో ఏరువాక కేంద్రం, కడప మరియు వ్యవసాయ శాఖ సంయుక్తంగా క్షేత్రాన్ని కాపాడుకుందాం కార్యక్రమాన్ని నిర్వహించాయి.ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం, కడప సమన్వయకర్త డా. ఎన్. కృష్ణప్రియ మాట్లాడుతూ శనగ పంటలో సేంద్రియ ఎరువుల ప్రాముఖ్యతను వివరించారు. పశువుల ఎరువు, వానపాముల ఎరువు, పచ్చిరొట్ట ఎరువుల వినియోగం ద్వారా భూసారాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. అలాగే శనగ పంటలో పాటించాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.కడప జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు బి. పద్మజ మాట్లాడుతూ భూసార పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. భూసార ఆరోగ్య పత్రం ద్వారా నేలలోని పోషక స్థాయిలను తెలుసుకొని, అవసరానికి అనుగుణంగా ఎరువులను సమతుల్యంగా వినియోగించుకోవాలని సూచించారు.వేంపల్లి మండల వ్యవసాయ అధికారి బాల గంగాధర్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న వివిధ ప్రభుత్వ పథకాలు, వాటి ప్రయోజనాలు, రైతులు వాటిని సద్వినియోగం చేసుకునే విధానం గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో రైతులు చురుకుగా పాల్గొని వ్యవసాయానికి సంబంధించిన తమ సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు.

అయ్యప్ప స్వాములకు ఉచిత అన్నదాన శిబిరం ప్రారంభం





బనగానపల్లె, నవంబర్= 10 ప్రజా జ్యోతి బనగానపల్లె పట్టణంలోని స్థానిక శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో అయ్యప్ప స్వామి దీక్షాధారణ స్వాముల కోసం గత 10 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఉచిత భిక్షా కార్యక్రమం ఈ ఏడాది కూడా ఘనంగా ప్రారంభమైంది. అయ్యప్పస్వామి అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ దీక్షా శిబిరాన్ని మంగళవారం వైకాపా సీనియర్ నేత, అవుకు మండల అధ్యక్షుడు కాటసాని తిరుపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బనగానపల్లె పట్టణంలోని అయ్యప్ప స్వాములు మండల కాల దీక్షను భక్తిశ్రద్ధలతో విజయవంతంగా పూర్తి చేసుకునేందుకు ఈ ఉచిత దీక్షా శిబిరం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. దీక్ష స్వీకరించిన స్వాములందరూ ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.కార్యక్రమంలో సి.హెచ్. నాగిరెడ్డి, దోనపాటి మహేశ్వర రెడ్డి, బి. రామసుబ్బారెడ్డి అన్నదాన కమిటీ సభ్యులు.తదితరులు పాల్గొన్నారు

ప్రతి పేదవాడికి సన్న బియ్యం పంపిణీ చేయాలి




నంద్యాల ఆళ్లగడ్డ:నవంబర్=10 ప్రజాజ్యోతి ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ లో రైతు బజార్లో పంపిణీ చేస్తున్న సన్నబియ్యం కార్యక్రమాన్ని పరిశీలించిన : ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ చైర్మన్ మైలేరి సురేఖ దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారి ఆశీస్సులతో, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి సారధ్యంలో, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ గారి సహకారంతో, ఆహార, పౌరసరఫరాల వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రివర్యులు శ్రీ నాదెండ్ల మనోహర్ గారి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, కూటమి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారి చేతుల మీదుగా మార్కెట్ యార్డ్ లో రైతు బజార్ లో ప్రారంభించినటువంటి రైతుబజార్ లో ప్రతి పేదవాడికి సన్న బియ్యం కేజీ 50/ రూపాయలుకే 26 కేజీల ప్యాకెట్ (1300/) పంపిణీ కార్యక్రమాన్ని ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ లో రైతు బజార్లో పంపిణీ చేస్తున్న దుకాణంలో బియ్యం నాణ్యతను పరిశీలించి రేషన్ కార్డు ఉన్న అర్హులైన ప్రతి పేదవాడికి 26 కేజీల సున్నబియ్యం బస్తాలను నిష్పక్షపాతంగా అందించవలసిందిగా సంబంధిత అధికారులను కోరడమైనది. కనుక ఆళ్లగడ్డ నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా మార్కెట్ యార్డ్ చైర్మన్ మైలేరి సురేఖ తెలియజేశారు.

సంజామల ఎంపీపీపై వీడని ఉత్కంఠ.

బనగానపల్లె:నవంబర్=10 ప్రజాజ్యోతి బనగానపల్లె నియోజకవర్గంలోని సంజామల మండల ఎపీపీపై వీడని ఉత్కంఠ నెలకొంది సంజామల మండలంలో 11ఎంపీటీసి స్థానాలు ఉండగా 7స్థానాలు టిడీపీ గెలుచుకుంది రిజర్వేషన్ల ఆధారంగా నలగురు బీసీ అభ్యర్థులు పోటీలో ఉన్నారు సంజామల, తోకల మద్దిలేటి, గిద్దలూరు, తెలుగు సంజీవరాయుడు, ఆర్ లింగందిన్నే, మూరబోయిన విజయ భాస్కర్ ,ఆల్వకొండ దూదేకుల మాబు ఎంపీపీ పదవి కోసం పోటిపడుతున్నారు ఈనేపథ్యంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఎవరికి అవకాశం కల్పిస్తారన్నది నేతల్లో ప్రజల్లోఆసక్తికరంగా మారింది



పీఠాల కోసం కూటమి నేతల పోటాపోటీ!



-మొదటిపేజీ తరువాయి

పదవుల పంపకాలపై చర్చలు

జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పదవుల పంపిణీపై టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. ఏ పార్టీకి ఎన్ని పదవులు ఇవ్వాలి? ఏయే జిల్లాలను ఏ పార్టీకి కేటాయించాలి? అనే అంశాలపై ఇంకా తుది నిర్ణయం వెలువడలేదు. ప్రాథమికంగా ఒక అవగాహనకు వచ్చిన తర్వాత కూడా కొన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కూటమి పార్టీల మధ్య అధికారిక ప్రకటన వెలువడకపోవడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. కొన్ని జిల్లాల్లో ఒకరి పేరు దాదాపు ఖరారైనట్లు ప్రచారం జరుగుతుండగా, మరికొన్ని జిల్లాల్లో ముగ్గురు, నలుగురు నేతలు పోటీలో ఉన్నారు.

శ్రీకాకుళం, విజయనగరంలో ఆసక్తికర పోటీ

శ్రీకాకుళం జిల్లాలో జనసేన నుంచి సుడా ఛైర్మన్ కొరికాన రవికుమార్ భార్య భవాని (ఎల్.ఎన్.పేట) ఛైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్నారు. ఏ కారణంతోనైనా జనసేనకు అవకాశం దక్కకపోతే టీడీపీ నుంచి తమ్మినేని సుజాత (ఆమదాలవలస), బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు భార్య త్రివేణి (హిరమండలం) పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. విజయనగరం జిల్లాలో మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు కుమార్తె చంద్రకళ (పూసపాటిరేగ), మజ్జి శ్రీనివాస్ కుమార్తె సిరిసహస్ర (తెర్లాం) పోటీలో ఉన్నారు. 2024 ఎన్నికల్లో జనసేనతో పొత్తులో భాగంగా నెల్లిమర్ల టికెట్‌ను వదులుకున్నానని, తన కుమార్తెకు ఛైర్‌పర్సన్ అవకాశం కల్పించాలని బంగార్రాజు కోరుతున్నట్లు సమాచారం.

ఉత్తరాంధ్రలో ఆశావహుల ప్రయత్నాలు

పార్వతీపురం మన్యం జిల్లాలో టీడీపీ నుంచి మాజీ ఎంపీ ప్రదీప్ చంద్రదేవ్ కుమారుడు వీరేశ్‌చంద్రదేవ్ (కురుపాం) పేరు ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది. కేంద్ర మాజీ మంత్రి కిశోర్‌చంద్రదేవ్ ఆయనకు పెదనాన్న అవుతారు. విశాఖపట్నం జిల్లాలో టీడీపీ నుంచి మాజీ ఎంపీపీ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు గాదు వెంకటప్పుడు భార్య అలివేణి (భీమిలి) పదవిని ఆశిస్తున్నారు. 2024 ఎన్నికలకు ముందు వెంకటప్పుడు వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరారు. సుఖవాసి అజయ్ (పెందుర్తి) పేరు కూడా రేసులో వినిపిస్తోంది. అనకాపల్లి జిల్లాలో టీడీపీ నుంచి కిలపర్తి రాజేశ్వరి (దేవరాపల్లి) ఆశావహుల్లో ఉన్నారు. ఆమె మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు భార్య. జనసేన నుంచి సేనాపతి రత్నం (రాంబిల్లి), పోతల భవాని (బుచ్చయ్యపేట) ప్రయత్నాలు చేస్తున్నారు.

గోదావరి జిల్లాల్లోనూ తీవ్ర పోటీ

కాకినాడ జిల్లాలో మాజీ ఎమ్మెల్యే, కాకినాడ రూరల్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పిల్లి అనంతలక్ష్మి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. జనసేన నుంచి బుర్రా దివ్య సునీతారాజ్ (పెద్దాపురం) పదవిని ఆశిస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు కుమార్తె, రాజోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి అమూల్య (మామిడికుదురు), వీరసత్యకుమారి (ఐ.పోలవరం) పోటీలో ఉన్నారు. వీరసత్యకుమారి గతంలో కేసనకుర్రు పంచాయతీకి రెండుసార్లు సర్పంచ్‌గా పనిచేశారు. గతంలో ముమ్మిడివరం అసెంబ్లీ టికెట్ చివరి నిమిషంలో చేజారడంతో ఇప్పుడు జడ్పీ ఛైర్‌పర్సన్ పదవిపై ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి (అడ్డతీగల), తీగల ప్రభ (గంగవరం), గొర్లె అమ్మాజీ (వై.రామవరం) పేర్లు వినిపిస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి తీగల ప్రభకు మద్దతు ఇస్తుండగా, పార్టీ నాయకత్వం వంతల రాజేశ్వరి వైపు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం.

చింతమనేని కుమార్తె పేరు ముందంజలో

తూర్పుగోదావరి జిల్లాలో జడ్పీ ఛైర్‌పర్సన్ పదవి జనసేనకు దాదాపు ఖరారైనట్లు ప్రచారం జరుగుతోంది. ఆ పార్టీ నాయకుడు రత్నం అయ్యప్ప భార్య మహేశ్వరిదేవి పేరు పరిశీలనలో ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో మొదటి నుంచీ టీడీపీలో కొనసాగుతున్న ఇందుకూరి రామకృష్ణరాజు (గణపవరం) పదవిని ఆశిస్తున్నారు. ఏలూరు జిల్లాలో పెదవేగి నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కుమార్తె నవ్యశ్రీ పేరు ముందంజలో ఉంది. ఆమె దిల్లీ విశ్వవిద్యాలయంలో రాజకీయ శాస్త్రంలో పీజీ చేశారు.

ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో పోటీ

ఎన్టీఆర్ జిల్లాలో టీడీపీ నుంచి కోట పుల్లమ్మ (గంపలగూడెం) పేరు ముందంజలో ఉన్నట్లు సమాచారం. ఎంటెక్ చదివిన ఆమె గతంలో గంపలగూడెం సర్పంచ్‌గా పనిచేశారు. గంపలగూడెం జడ్పీటీసీ స్థానం జనరల్ మహిళకు రిజర్వు కావడంతో ఆమెను అక్కడి నుంచి పోటీ చేయించినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఆమె తండ్రి కోట లక్ష్మయ్య గతంలో సర్పంచ్‌గా పనిచేశారు. జిల్లేపల్లి సుధీర్‌బాబు (పెనుగంచిప్రోలు) కూడా ఛైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్నారు. బీఈడీ చదివిన ఆయన గతంలో పెనుగంచిప్రోలు సర్పంచ్‌గా పనిచేశారు. కృష్ణా జిల్లాలో టీడీపీ నుంచి విక్కుర్తి జయలక్ష్మి (అవనిగడ్డ), దండపూడి పూజిత (కంకిపాడు), ప్రవళి (పమిడిముక్కల) పోటీలో ఉన్నారు. జయలక్ష్మి అవనిగడ్డ టీడీపీ ఇన్‌ఛార్జి విక్కుర్తి శ్రీనివాస్ భార్య. పూజిత భర్త దండమూడి చౌదరిపై వైఎస్సార్‌సీపీ హయాంలో 20కి పైగా కేసులు నమోదయ్యాయని సమాచారం. తాతినేని ప్రవళి న్యాయవాదిగా పనిచేస్తూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు.

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఆశలు

గుంటూరు జిల్లాలో టీడీపీ నుంచి దారా అరుణ (వట్టిచెరుకూరు), దొప్పల ఉషాకిరణ్మయి (పెదనందిపాడు) ఛైర్‌పర్సన్ పదవికి పోటీపడుతున్నారు. పల్నాడు జిల్లాలో జనసేన నుంచి బొర్రా అనిత (ముప్పాళ్ల) ఆశావహుల్లో ముందున్నారు. బాపట్ల జిల్లాలో టీడీపీ నుంచి పూషడపు రోహిణి (చెరుకుపల్లి), కొనసాని రమాదేవి (నిజాంపట్నం) పోటీలో ఉన్నారు. ప్రకాశం జిల్లాలో వలేటివారిపాలెం జడ్పీటీసీ సభ్యుడు కోరుకొండ అంజిబాబు పేరు పరిశీలనలో ఉంది.

మార్కాపురంలో రామిరెడ్డి పేరు దాదాపు ఖరారు?

మార్కాపురం జిల్లాలో దోర్నాల జడ్పీటీసీ సభ్యుడిగా గెలిచిన కందుల రామిరెడ్డి పేరు దాదాపు ఖరారైనట్లు పార్టీ వర్గాల సమాచారం. నెల్లూరు జిల్లాలో టీడీపీ నుంచి కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి (ఇందుకూరుపేట), ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి (దుత్తలూరు) పోటీలో ఉన్నారు. తిరుపతి జిల్లాలో టీడీపీ నుంచి సత్యవేడు మాజీ ఎమ్మెల్యే హేమలత, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి కుమార్తె చేతన (శ్రీకాళహస్తి) ఛైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్నారు.

అనంతపురం, కర్నూలు జిల్లాల్లో పోటీ

అనంతపురం జిల్లాలో గార్లదిన్నె జడ్పీటీసీ సభ్యుడు గంజే నాగరాజుకు ఛైర్‌పర్సన్ పదవి ఖరారు కావచ్చని ప్రచారం జరుగుతోంది. పోలింగ్‌కు ముందు పలువురి పేర్లు వినిపించినా, ఫలితాల తర్వాత ఆయన పేరు మాత్రమే ప్రధానంగా వినిపిస్తోందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కర్నూలు జిల్లాలో టీడీపీ నుంచి గతంలో మంత్రాలయం ఎమ్మెల్యే టికెట్ ఆశించిన ఉలిగయ్య (కౌతాళం) పేరు బలంగా వినిపిస్తోంది. శంకరమ్మ (ఆదోని-2), డాక్టర్ షేక్ సాదికా (దేవనకొండ), జ్ఞానేశ్ (కోసిగి), గీతాకుమారి (తుగ్గలి) కూడా ప్రయత్నాలు చేస్తున్నారు.

నంద్యాల, శ్రీసత్యసాయి జిల్లాల్లోనూ ఉత్కంఠ

నంద్యాల జిల్లాలో వెలుగోడు నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన రమణారెడ్డి పేరు వినిపిస్తోంది. శ్రీకాంత్‌రెడ్డి (సిరివెళ్ల), రాజశేఖరరెడ్డి (ఆళ్లగడ్డ) కూడా పోటీలో ఉన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో జనసేన నుంచి చిలకం మధుసూదన్‌రెడ్డి (పుట్టపర్తి) పేరు దాదాపు ఖరారైనట్లు ప్రచారం జరుగుతోంది. చివరి నిమిషంలో మార్పులు జరిగితే టీడీపీ నుంచి పరిటాల శ్రీరామ్ (నల్లచెరువు)కు అవకాశం దక్కవచ్చని తెలుస్తోంది.

కడపలో బీజేపీకి ఛాన్స్?

కడప జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవిని బీజేపీకి కేటాయించాలని కూటమి నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఆ పార్టీ నుంచి జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్న కుమారుడు రాజేశ్‌రెడ్డి పేరు రేసులో ఉంది.

బీజేపీకి మరో జిల్లాను కేటాయిస్తే, కడపలో టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి (వీరపనేనిపల్లె), భారతి (పులివెందుల) పేర్లు పరిశీలనలోకి వచ్చే అవకాశముంది.

అన్నమయ్య, చిత్తూరులో చివరి దశ ప్రయత్నాలు

అన్నమయ్య జిల్లాలో గాలివీడు నుంచి జడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నికైన టీడీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌బాబు పేరు బలంగా వినిపిస్తోంది. ఆయన మాజీ ఎమ్మెల్యే పాలకొండ్రాయుడి కుమారుడు. చిత్తూరు జిల్లాలో టీడీపీ నుంచి శైలజా తేజోమూర్తి (పూతలపట్టు) పేరు దాదాపు ఖరారైనట్లు ప్రచారం జరుగుతోంది. మమతశ్రీ (గుడిపాల), సుచిత్ర జయప్రకాశ్ (బంగారుపాళ్యం), జాహ్నవి బాబు (పాలసముద్రం) కూడా ఛైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్నారు.

20న తేలనున్న ఉత్కంఠకు తెర

1జడ్పీ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ పదవుల కోసం కూటమి నేతలు తీవ్రంగా ప్రయత్నిస్తుండటంతో జిల్లాల్లో రాజకీయ వేడి పెరిగింది. పార్టీల మధ్య సీట్ల పంపకాలపై తుది నిర్ణయం వెలువడిన తర్వాత ఆశావహుల భవితవ్యం తేలనుంది. ఈ నెల 20న జరిగే ఎన్నికలతో ఏ జిల్లాలో ఎవరు పీఠాన్ని అధిష్ఠిస్తారన్న ఉత్కంఠకు తెరపడనుంది.

తుపాను పోయినా తీరని వరద కష్టాలు

మురసు పోయింది, వర్షాలు ఆగిపోయాయి, గోదావరి జిల్లాల ప్రజలకు వరద కష్టాలు మాత్రం పోవట్లేదు. ఎర్ర కాలువ, గోస్తాని డ్రెయిన్ ఉద్ధృతికి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలోని పలు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రోడ్లు తెగిపోయాయి, పంటలు మునిగిపోయాయి. దీంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పందల ఎకరాల్లో పంట నష్టం : పశ్చిమ గోదావరి జిల్లాలో గోస్తాని డ్రెయిన్ ఉప్పొంగి ప్రవహిస్తోంది. పెనుమంట్ర మండలం సోమరాజు ఇల్లిందపర్రు గ్రామంలోని పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. సుమారు 15 పందల ఎకరాల్లోని వరి పంట మునిగిపోయింది. గత ఆరు రోజులుగా పొలాల్లో నీరు నిలిచిపోయి పంట కుళ్లిపోతుంది. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టామని వరద నిండా ముంచేసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోస్తాని డ్రెయిన్ ఉద్ధృతికి పెనుమంట్ర మండలం జుత్తిగలోని శ్రీ ఉమా వాసుకి రవి సోమేశ్వర స్వామి దేవస్థానం ముంపునకు గురైంది. ఉప ఆలయాలు కూడా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దేవస్థాన ప్రాంగణంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం చుట్టూ మోకాలి లోతు నీరు చేరింది. మరోవైపు కార్తిక మాసంలో భక్తులు దీపాలు వదిలే ఆలయం పక్కన చెరువు కూడా వరదతో ఉగ్రరూపం దాల్చింది. దీపాలు వదిలేందుకు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వరద నీటిలోనే బస్టాండ్

ఎర్రకాలువ ఉద్ధృతితో పయ్యేరు ఉప్పొంగి ప్రవహిస్తోంది. తణుకు మండలం దువ్వ -- ముద్దాపురం రహదారి తెగిపోయింది. పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాలు పూర్తిగా మునిగిపోయాయి. వర్షాలు ఆగిపోయి వారం దాటినా తణుకు ఆర్టీసీ బస్టాండ్, డిపో ఇంకా వరద నీటిలోనే ఉన్నాయి. ప్రయాణికులు లోపలికెళ్లే వీలు లేకపోవడంతో బస్టాండ్ ముందున్న రహదారిపైనే బస్సులు ఆపుతున్నారు. ప్రయాణికులు వేచి ఉండేందుకు ప్లై ఓవర్ కింద బెంచీలు ఏర్పాటు చేశారు. పట్టణంలో ఎగువ నుంచి వచ్చే వరద దిగువన ఉన్న ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో చేరింది. బస్టాండ్‌కు దిగున ఉన్న మురుగు కాలువలు నిండిపోయాయి. నీరు వెళ్లే మార్గం లేదు.

అర్నబ్ తుపానుతో భారీ నష్టం



అమరావతి: అర్నబ్, మురసు తుపాన్ల కారణంగా దెబ్బతిన్న పంటల నష్టాల నమోదును వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. అర్హులైన ఒక్క రైతు కూడా నష్టపరిహారం అందకుండా మిగిలిపోకూడదని స్పష్టం చేశారు. రెండు తుపాన్ల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా 4,61,194 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. అర్నబ్ తుపాను కారణంగా 3,27,843 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయి. ఈ ప్రభావంతో 5,23,136 మంది రైతులు నష్టపోయారు. పంటలకు మొత్తం రూ.2,392.84 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులు వెల్లడించారు. మురసు తుపాను కారణంగా 1,33,351 హెక్టార్లలో పంటలు దెబ్బతినగా, 1,86,269 మంది రైతులపై ప్రభావం పడినట్లు తెలిపారు.

ఉద్యాన పంటల నష్టాల నమోదులో జాప్యం

రెండు తుపాన్ల కారణంగా కలిపి 29,960 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. అర్నబ్ తుపాను వల్ల జరిగిన ఉద్యాన పంటల నష్టాల నమోదు 99.24 శాతం పూర్తయింది. అయితే మురసు తుపాను నష్టాల నమోదు మాత్రం 32.77 శాతమే పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. ఈ పురోగతిపై మంత్రి అచ్చెన్నాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. మురసు తుపాను వల్ల జరిగిన పంట నష్టాల నమోదును తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరత ఉంటే వెంటనే భర్తీ చేసి, నష్టపోయిన ప్రతి రైతును గుర్తించాలని సూచించారు. నష్టాల నమోదు ప్రక్రియ పూర్తయిన వెంటనే అర్హులైన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

సామాన్యుడికి గుడ్‌న్యూస్

రేషన్ దుకాణాల్లో సబ్సిడీపై కందిపప్పు, పామాయిల్



ప్రైవేటు మార్కెట్లో ఆకాశాన్ని అంటుతున్న నిత్యావసరాల ధరలకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. పండుగల సీజన్‌లో సామాన్యుడిపై ఆర్థిక భారం తగ్గించేలా కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా పౌరసరఫరాల శాఖ ద్వారా సబ్సిడీ సరకులు అందించనుంది. రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీ ధరలకే కందిపప్పు, పామాయిల్, గోధుమపిండి సరఫరా చేయనుంది. ఈ మేరకు మార్కెట్ ఇంటర్వెన్షన్ (మార్కెట్ జోక్యం) కోసం ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. తొలి దశలో మూడు నెలల పాటు ఈ మార్కెట్ జోక్యం కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. రేషన్ కార్డుకు ఒక కిలో కందిపప్పును కేవలం రూ.100 కే అందిస్తారు. ఇందుకోసం నెలకు 14,888 మెట్రిక్ టన్నుల కోటాను కేటాయించారు. పామాయిల్ కూడా సబ్సిడీ ధరకు ఇస్తారు. కార్డుకు ఒక లీటర్ చొప్పున రూ.125 కే అందిస్తారు. దీనికి నెలవారీ కోటా కింద 14,888 కిలో లీటర్లు అందజేస్తారు. ఇక గోధుమపిండి కిలో రూ.25 కే అందిస్తారు. అయితే ఇది ముందు వచ్చిన వారికి మొదటి ప్రాధాన్యత విధానంలో (ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్) ఇస్తారు. గోధుమపిండి నెలవారీ కోటాను 3,384 మెట్రిక్ టన్నులుగా నిర్ణయించారు.

రూ.300 కోట్ల సబ్సిడీ భారం

ఈ సబ్సిడీ పథకం అమలుకు నెలకు రూ.100.20 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. మూడు నెలలకు కలిపి సుమారు రూ.300.60 కోట్ల భారం పడనుంది. ఈ గరిష్ట సబ్సిడీ పరిమితికి లోబడి పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఖర్చును ప్రభుత్వం నేరుగా భరించదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ తన సొంత నిధుల నుంచే ఈ సబ్సిడీ భారాన్ని భరించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. సామాన్యులకు తక్కువ ధరకే సరకులు అందించే బాధ్యతను ఆ సంస్థకే అప్పగించింది. సబ్సిడీ సరకులు పక్కదారి పట్టకుండా ప్రభుత్వం కఠిన నిబంధనలు విధించింది. రేషన్ దుకాణాల్లో ఈ-పోస్ విధానం ద్వారానే వీటిని విక్రయిస్తారు. వాస్తవంగా విక్రయించిన పరిమాణానికి మాత్రమే ఈ సబ్సిడీ వర్తిస్తుందని స్పష్టం చేసింది. తొలి విడతగా మూడు నెలల పాటు ఈ పథకం అమలులో ఉంటుంది. ఆ తర్వాత క్షేత్రస్థాయిలో వచ్చే ఫలితాలను ప్రభుత్వం అంచనా వేస్తుంది. ప్రజల నుంచి వచ్చే డిమాండ్‌ను బట్టి ఈ పథకాన్ని పొడిగించాలా వద్దా అనే అంశంపై ప్రభుత్వం మళ్లీ సమీక్ష నిర్వహించనుంది.

తిరుపతిలో డిక్సన్ టెక్నాలజీస్‌కు భూ కేటాయింపు

-మొదటిపేజీ తరువాయి

అనుమతులు మంజూరు చేసింది. రూ.570.20 కోట్ల పెట్టుబడితో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా 2,565 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. అదానీ క్లౌడ్ హబ్ ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష నివేదికను కూడా పరిశీలించింది.

డిక్సన్ యూనిట్‌తో 2,300 మందికి ఉపాధి

తిరుపతి జిల్లాలోని నాయుడుపేటలో కార్బన్ కాస్మో సంస్థ ఏర్పాటు చేయనున్న పరిశ్రమకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.4,000.20 కోట్ల పెట్టుబడితో ఎల్ఎఫ్‌పీ ప్రీకర్సర్, క్యాథోడ్ మెటీరియల్స్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా 700 మందికి ఉపాధి లభించనుంది. తిరుపతిలో డిక్సన్ టెక్నాలజీస్ సంస్థ ఏర్పాటు చేయనున్న యూనిట్‌కూ అనుమతులు ఇచ్చింది. రూ.700 కోట్ల పెట్టుబడితో చేపట్టనున్న ఈ పరిశ్రమ ద్వారా 2,300 మందికి ఉద్యోగ అవకాశాలు కలగనున్నాయి. భీమిలిలో అమానం సంస్థ ఏర్పాటు చేయనున్న గ్రీన్ ఇంటిగ్రేటెడ్ ఏఐ డేటా సెంటర్‌కు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 512 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టు కోసం రూ.31,387 కోట్ల పెట్టుబడి పెట్టనున్నారు. దీనివల్ల 1,000 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. భోగాపురంలో రిలయన్స్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు భూముల బదలాయింపు ప్రతిపాదనకూ కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రావలి స్పిన్నర్స్ పరిశ్రమ విస్తరణకు కూడా అనుమతులు మంజూరు చేసింది. రూ.236.92 కోట్ల పెట్టుబడితో చేపట్టనున్న విస్తరణ ద్వారా 1,569 మందికి ఉపాధి లభించనుంది.

వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి

ఆఫ్ గ్రీన్ ఎనర్జీ, న్యూల్యాండ్ ల్యాబ్స్ సంస్థలకు ప్రోత్సాహకాలు మంజూరు చేసే ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. విజయవాడలో 15 మెగావాట్ల సామర్థ్యంతో వ్యర్థాల నుంచి విద్యుత్ తయారు చేసే ప్లాంటు ఏర్పాటుకు అనుమతించింది. ఈ ప్లాంటులో రోజుకు 1,023 టన్నుల చెత్తను ప్రాసెస్ చేయనున్నారు. ఇందుకోసం జెన్‌కోకు చెందిన 5.50 ఎకరాల భూమిని విజయవాడ నగరపాలక సంస్థకు ఉచితంగా బదలాయించనున్నారు.



పోలీసు శాఖలో ప్రత్యేక విభాగం

మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక ట్రాఫిక్ నిర్వహణ, రహదారి భద్రతా విభాగాన్ని ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. డీజీపీ పరిధిలో పనిచేసే ఈ విభాగానికి ఐజీ స్థాయి అధికారి డైరెక్టర్‌గా వ్యవహరించనున్నారు.

టీటీడీలో కొత్త పోస్టులు

తిరుమల తిరుపతి దేవస్థానంలో రెండు కొత్త పోస్టుల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాన సన్నిధి యాదవ, అదనపు సన్నిధి యాదవ పోస్టులను మంజూరు చేసింది. దేవాదాయ శాఖ శిల్ప విభాగంలో చీఫ్ స్థపతి పోస్టు ఏర్పాటుకూ పచ్చజెండా ఊపింది.

అణు విద్యుత్ రంగంలో ప్రైవేటు భాగస్వామ్యం

చిన్న మాడ్యులర్ రియాక్టర్ల సాంకేతికత అందుబాటులోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అణు విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటులో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యానికి అనుమతించాలని కేబినెట్ నిర్ణయించింది. సెంబ్‌కార్ప్ సంస్థకు సంబంధించిన రూ.48.73 కోట్ల వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ప్రతిపాదనను షరతులతో క్రమబద్ధీకరించింది. రాష్ట్రంలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకూ అనుమతులు ఇచ్చింది. గ్రీన్‌కో సౌర విద్యుత్ ప్రాజెక్టు సామర్థ్యాన్ని ప్రస్తుతం ఉన్న 500 మెగావాట్ల నుంచి 1,500 మెగావాట్లకు పెంచాలని నిర్ణయించింది.

ప్రచురణకు ముందు పరిశీలించాల్సిన అంశాలు:

డిక్సన్ టెక్నాలజీస్‌కు భూ కేటాయింపు జరిగిందా, లేక యూనిట్ ఏర్పాటుకు మాత్రమే అనుమతి ఇచ్చారా అన్నది అధికారిక కేబినెట్ ప్రకటనతో నిర్ధారించాలి. అమానం, కార్బన్ కాస్మో, ఈ-ప్యాక్ సంస్థల పేర్లు, పెట్టుబడుల మొత్తాలు, ఉద్యోగాల సంఖ్యను అధికారిక పత్రాలతో సరిచూడాలి. టీటీడీలో మంజూరైన రెండు పోస్టుల అధికారిక హోదాల పేర్లను నిర్ధారించాలి. అణు విద్యుత్ రంగంలో ప్రైవేటు భాగస్వామ్యంపై తీసుకున్న నిర్ణయం అమలు విధానాన్ని అధికారిక ప్రకటన ఆధారంగా స్పష్టం చేయాలి.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి కంబాల చేయూత.

రూ.10 వేల ఆర్థిక సహాయం, 50 కిలోల బియ్యం పంపిణీ.



గోకవరం (ప్రజా జ్యోతి ప్రతినిధి) నవంబర్ 10:అగ్నిప్రమాదం బాధితులకు విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు గారు చేయూత అందించారు. తూర్పుగోదావరి జిల్లా, జగ్గంపేట నియోజకవర్గం, గోకవరం గ్రామంలోని సంజీవ్ నగర్‌కు చెందిన దళిత కుటుంబ సభ్యులు, గొర్ర బాపనమ్మ, గొర్ర మణి, గొర్ర ప్రమీల నివాసం ఉంటున్న తాటాకిల్లు మంగళవారం జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లోని నిత్యావసర వస్తువులు, దుస్తులు, గృహోపకరణాలు, సహా సమస్త సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో బాధిత కుటుంబం కట్టు బట్టలతో రోడ్డున పడ్డారు. ఈ దుర్ఘటన గురించి బీజేపీ దళిత నాయకులు వరసాల ప్రసాద్ ద్వారా తెలుసుకున్న కంబాల శ్రీనివాసరావు గారు వెంటనే బాధిత కుటుంబం వద్దకు చేరుకుని వారిని పరామర్శించారు.అగ్ని ప్రమాదంలో కాలిపోయిన ఇంటిని స్వయంగా పరిశీలించి, ప్రమాదం జరిగిన తీరును బాధితులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ధైర్యం చెబుతూ, అధైర్యపడవద్దని, కష్టకాలంలో తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు.అనంతరం బాధిత కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.10 వేల నగదు ఆర్థిక సాయంతో పాటు 50 కిలోల బియ్యాన్ని అందజేశారు.అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి తక్షణమే స్పందించి ఆర్థిక, నిత్యావసర సహాయం అందించిన కంబాల శ్రీనివాసరావు గారిని స్థానికులు, అభినందించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, దళిత నాయకులు, యువత, తదితరులు పాల్గొన్నారు....

టిప్పు సుల్తాన్ జయంతి వేడుకల్లో కౌన్సిలర్ ఇందాద్‌కు ఘన సన్మానం



హిందూపురం: ప్రజా జ్యోతి న్యూస్ నవంబర్ 10: శ్రీ సత్య సాయి జిల్లా బ్యూరో అంజి: టిప్పు సుల్తాన్ జయంతి సందర్భంగా మంగళవారం నిర్వహించిన వేడుకల్లో 25వ వార్డు టీడీపీ కౌన్సిలర్ ఎం డి ఎస్ ఇందాద్‌ను ఘనంగా సన్మానించి అభినందించారు ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించిన ఇందాద్ మాట్లాడుతూ తన విజయానికి సహకరించిన వార్డు ప్రజలందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు

తండ్రిపేరుతప్పనిసరి నిబంధన లేకుండా!.

అన్ని అధికారిక పత్రాల్లో మార్పులు తీసుకురావడంపై!..

రాష్ట్ర స్థాయి సదస్సు!..



వరరామచంద్రాపురం, నవంబర్ 10 (ప్రజాజ్యోతి ప్రతినిధి) విజయవాడలోని స్వర్ణ ప్యాలెస్ వేదికగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఏ.పి.ఎస్.సి.పి.సి.ఆర్,) చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ (సి.ఐ. ఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో, అన్ని అధికారిక పత్రాలలో తండ్రి పేరు తప్పనిసరి కాకుండా చేయడం, అనే అంశం పై రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. మంగళవారం, ఈ సదస్సులో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ వేటుకూరి సూర్యనారాయణరాజు, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ, కమిషన్ సభ్యులు ఉండవల్లి గాంధీబాబు, పద్మలత, మందాల గంగసూర్యనారాయణ, చల్లా మధుసూదనరావు, నాగమానస మరియు చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ (సి.ఐ.ఎఫ్,) ప్రతినిధులతో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థల (ఎన్. జీ.ఓ,) ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పిల్లల హక్కుల పరిరక్షణ, ఒంటరి తల్లుల పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు, తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన సామాజిక అంశాలు, అధికారిక పత్రాల జారీలో ఎదురవుతున్న ఇబ్బందులపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా తండ్రి పేరు తప్పనిసరిగా పేర్కొనాల్సిన నిబంధన కారణంగా కొంతమంది పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వారి హక్కులకు భంగం కలగకుండా అన్నిఅధికారిక పత్రాల్లో తండ్రి పేరు తప్పనిసరి అనే నిబంధనను తొలగించేదిశగా అవసరమైన మార్పులు తీసుకురావాల్సిన ఆవశ్యకతను సదస్సులో చర్చించారు.తండ్రి పేరు మార్పుకోసం ప్రయత్నం చేస్తున్నామని ఈసందర్భంగా వివరించారు.

గర్భిణులకు సంరక్షణ...మాతృత్వానికి భద్రత

చింతకుంట పీహెచ్‌సీలో వైభవంగా పీఎంఎస్ఎంఏ కార్యక్రమం

వైద్యాధికారి డాక్టర్ వికసిత ఆధ్వర్యంలో 32 మందికి ఉచిత వైద్య పరీక్షలు

15 మంది హైరిస్క్ గర్భిణుల గుర్తింపు.. ఆశా కార్యకర్తల ద్వారా నిరంతర పర్యవేక్షణ

దువ్వూరు,నవంబరు11(ప్రజా జ్యోతి) మండల పరిధిలోని చింతకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వైద్యాధికారి డాక్టర్ వికసిత ఆధ్వర్యంలో 'ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్' కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. "సురక్షితమైన ప్రసవం -- ప్రతి తల్లికి భద్రత, ప్రతి శిశువుకు ఆరోగ్యకరమైన భవిష్యత్తు" అనే నినాదంతో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక వైద్య శిబిరంలో సుమారు 32 మందికి పైగా గర్భిణీ స్త్రీలకు ఉచితంగా వైద్య పరీక్షలు మరియు అల్ట్రాసౌండ్ స్కానింగ్ సేవలను అందించారు.ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ వికసిత మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణీ మహిళల ఆరోగ్య సంరక్షణకు ఈ పథకం ఒక వరం లాంటిదని కొనియాడారు. గర్భం దాల్చిన రెండవ లేదా మూడవ త్రైమాసికంలో ఉన్న మహిళలకు ప్రతి నెలా 9వ తేదీన పీహెచ్‌సీ వేదికగా ఉచిత సేవలు అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. గైనకాలజిస్టులు, నిపుణులైన వైద్యాధికారుల చేత ఉచిత తనిఖీలతో పాటు.. రక్తహీనత హెచ్‌బీ, మధుమేహం, రక్తపోటు, మరియు మూత్ర పరీక్షలు వంటి ల్యాబ్ పరీక్షలను పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. అవసరమైన గర్భిణులందరికీ ఐరన్, ఫోలిక్ యాసిడ్, క్యాల్షియం మాత్రలను ఉచితంగా పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.ఈ శిబిరంలో పరీక్షలు నిర్వహించిన వారిలో 15





మందిని ప్రమాదకర స్థితిలో ఉన్నగర్భిణులుగా గుర్తించినట్లు డాక్టర్ వికసిత వెల్లడించారు. సాధారణ తనిఖీలతో పాటు ఇలాంటి హై-రిస్క్ ప్రెగ్నెన్సీ కలిగిన మహిళలను ప్రత్యేకంగా ట్రాక్ చేసే వ్యవస్థను బలోపేతం చేశామని, వీరు సురక్షితంగా డెలివరీ అయ్యేంత వరకు ఆశా కార్యకర్తల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తామని స్పష్టం చేశారు.శిబిరంలో రక్తహీనతతో బాధపడుతున్న మహిళలను గుర్తించి, వారు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేసే పోషకాహారాన్ని (కోడిగుడ్లు, పాలు, రాగిజావ మరియు ఆకుకూరలు) తప్పనిసరిగా తీసుకోవాలని వైద్యాధికారులు అవగాహన కల్పించారు. అలాగే ప్రసవ ప్రణాళిక, అత్యవసర సమయాల్లో 102, 108 ఉచిత వాహనాల వినియోగం మరియు ప్రభుత్వ ఆసుపత్రులలోనే ప్రసవాలు చేయించుకోవాల్సిన ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ పథకం మరియు అనుబంధ ప్రభుత్వ పథకాల సమన్వయం వల్ల దేశంలో మాతృ మరణాల రేటు గణనీయంగా తగ్గుముఖం పట్టిందని డాక్టర్ వికసిత ఈ సందర్భంగా గుర్తుచేశారు.ఈ వైద్య శిబిరంలో ఆరోగ్య విస్తరణ అధికారి రాజగోపాల్, ఆరోగ్య పర్యవేక్షకులు శివ గంగరాజు, రాజేశ్వరమ్మ, సిహెచ్ఓలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

గొల్లప్రోలులో లబ్ధిదారురాలికి రూ. 30,786 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత

గొల్లప్రోలు ప్రజా జ్యోతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో పేదల ఆరోగ్యానికి జనసేన పార్టీ అండగా నిలుస్తోంది. నియోజకవర్గ పరిధిలోని గొల్లప్రోలు టౌన్ రైల్వే స్టేషన్ ప్రాంతంలో నివాసముంటున్న సూర్నీడి దేవి తన ఆరోగ్య సమస్యల రీత్యా వైద్యం చేయించుకున్నారు. ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం చేయాల్సిందిగా ఆమె గతంలో చేబ్రోలులోని జనసేన పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కొరకు దరఖాస్తు చేసుకున్నారు.ఈ దరఖాస్తుపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం, ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 30,786 మంజూరు చేసింది. ఈ మేరకు మంగళవారం సాయంత్రం గొల్లప్రోలు పట్టణ జనసేన పార్టీ అధ్యక్షులు మామిడాల సూరిబాబు ఆధ్వర్యంలో లబ్ధిదారురాలికి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ముఖ్య నాయకులు బలిరెడ్డి గంగబాబు, బసా చిట్టిబాబు, మొగిలి వీరబాబు, బసా రాజా, మేడిశెట్టి నాగమణి, వినుకొండ అమ్మాజీ లతో పాటు పలువురు జనసేన నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు. తమ కష్టకాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ అందేలా కృషి చేసిన



డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి స్థానిక జనసేన నాయకులకు లబ్ధిదారురాలి కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

పోషన్ భి పడాయిద భి పై అంగన్వాడీలకు శిక్షణ

దువ్వూరు,నవంబరు 10 (ప్రజా జ్యోతి) అంగన్వాడీ కార్యకర్తలకు వారి సమర్థ్య నిర్మాణం పెంపొందించుటకు దువ్వూరు మండల కేంద్రంలోని జడ్పీహెచ్ పాఠశాల లో పోషన్ భి పడాయి భి రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మండలంలోని ఐసీడీఎస్ సూపర్ వైజర్లు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 0నుండి 6 సంవత్సరాలు పిల్లలలో సమగ్రభివృద్ధి పోషణ, కార్యక్రమాలు, ఆధారశీల, నావచేతన పిల్లల వృద్ధి పర్యవేక్షణ, దివ్యంగ పిల్లల స్క్రీనింగ్, పోషణ ట్రాకర్ యాప్ వంటి వివిధ అంశాల గురించి అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించడం మరియు అమలు గురించి శిక్షణ ఇచ్చారు.మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు నాణ్యమైన ఆట ఆధారిత



అభ్యసనాన్ని అందించడానికి పాఠ్యాంశాలు మరియు బోధన విధానాల యొక్క ప్రాథమిక జ్ఞానంతో అంగన్వాడి వర్కర్లకు జ్ఞానాన్ని బలోపేతం చేయడం జరిగిందన్నారు.ఈ శిక్షణ కార్యక్రమంలో సూపర్ వైజర్లు కళావతి,వరలక్ష్మి, సౌజన్య, మరియు మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖ రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పశు ఆరోగ్యశిబిరాలు

దువ్వూరు,నవంబరు 10 (ప్రజా జ్యోతి) మండలంలోని పెద్ద బొకరాపురం గ్రామంలో కానగూడూరు పశు వైద్యాధికారి డాక్టర్ రవీంద్ర రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పశు ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేశారు.ఈ శిబిరంలో 9పశువులకు గర్భకోశవ్యాధులకు చికిత్స, 28దూడలకు నట్టల నివారణ మందులు, 31సాధారణ చికిత్స, 481గొర్రెలు మరియు మేకలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. అలాగే పశు భీమా, లింగ నిర్ధారణ వీర్యం గురించి రైతులకు అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ లక్ష్మికాంత్, పశుసంవర్ధకం అసిస్టెంట్స్ ఆరిఫ్, సుప్రజ, మహిత, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి అమీర్, మరియు ,పాడి రైతులు, జీవాల సంరక్షకులు పాల్గొన్నారు.



బ్రెయిన్ క్యాన్సర్ తో బాధపడుతున్న బ్రాహ్మణ శ్రీజా



నంద్యాల:నవంబర్=10 ప్రజాజ్యోతి నంద్యాల(జిల్లా) బనగానపల్లె నియోజకవర్గం కోవెలకుంట్ల మండలంలోని కంపమల్ల గ్రామంలో బ్రాహ్మణ కుటుంబంలో ఒక్కరు జనార్దన్ బాపనయ్య కూతురు శ్రీజా కి బ్రెయిన్ క్యాన్సర్ వచ్చింది... మీకు చేతనైన సహాయం చేయండి అదేవాది దేవతలు దేవుని రూపంలో మిమ్మల్ని పంపిస్తారు ఈ అర్చకుడు నంద్యాలలో దేవాలయంలో అర్చకుడు గా జీవనం కొనసాగిస్తున్నాడు సెల్ 9948110469 సహాయం చేసి ఒక ప్రాణాన్ని కాపాడిన వారు అవుతారు

దుర్గాడలో ఆధ్యాత్మిక పండగ.. కార్తీక మాసం వేళ విద్యుత్ దీపాల కాంతుల్లో మెరిసిపోతున్న శివాలయం





గొల్లప్రోలు ప్రజా జ్యోతి కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా గొల్లప్రోలు మండలం దుర్గాడలోని శ్రీ రామలింగేశ్వర స్వామివారి ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. స్వామివారి సన్నిధిలో నిర్వహిస్తున్న 108 రోజుల భజన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కొన సాగుతోంది. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.1976--2026 మధ్య 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీ రామలింగేశ్వర స్వామివారి స్వర్ణోత్సవ బ్రహ్మోత్సవాలు ప్రస్తుతం వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేస్తున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరుతున్నారు.

గొల్లప్రోలు 10వ వార్డులో రికార్డు విజయం

సీటు జనసేనకైనా..గెలుపు నాదేనన్న టిడిపి 'రెబల్' మణి శ్రీనివాస్!

మళ్ళీ పసుపు కండువా కప్పుకున్న సింహం!

అధిష్టానం పక్కన పెట్టినా.. కార్యకర్తల గుండెల్లో చెరగని ముద్ర





గొల్లప్రోలు ప్రజా జ్యోతి రాజకీయాలు ఏవైనా కావచ్చు.. పొత్తులు ఏవైనా కావచ్చు.. కానీ కార్యకర్త ఇచ్చిన మాట, గుండెల్లో దాచుకున్న పసుపు జెండా ముందు ఏ శక్తులూ నిలబడలేవని గొల్లప్రోలు పురపాలక సంఘం 10వ వార్డు మార్కండేయపురం నిరూపించింది. అధిష్టానాల లెక్కలు తప్పినా.. కార్యకర్తల నమ్మకం తప్పలేదు! పొత్తులో భాగంగా సీటు జనసేనకు కేటాయించినా.. "మా లీడర్ మణి శ్రీనివాస్" అంటూ సింహంలా బరిలోకి దించి, 217 ఓట్ల భారీ మెజార్టీతో గెలిపించుకున్న కార్యకర్తల నమ్మకానికి గిడుతూరి మణి శ్రీనివాస్ సంచలన ప్రకటన చేశారు. "నేను రెబల్‌గా పోటీ చేసింది పార్టీపై తిరుగుబాటుతో కాదు.. కార్యకర్తలకు ఇచ్చిన మాట కోసం.. నా గెలుపు తెలుగుదేశం పార్టీదే.. నేను ఎప్పటికీ టిడిపిలోనే కొనసాగుతాను!" అంటూ పత్రికా ముఖంగా సింహగర్జన చేశారు.

అధిష్టానం లెక్కలు తారుమారు..

మార్కండేయపురం 10వ వార్డు. ఇక్కడ టిడిపి క్యాడర్ ఉప్పెనలా ఉంటుంది. గత మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ కోసం పోరాడి స్వల్ప తేడాతో ఓటమి చెందిన గిడుతూరి మణి శ్రీనివాస్ (మణి)కి, ఈసారి ఎలాగైనా గెలిపించుకుంటామని స్థానిక కార్యకర్తలు, అభిమానులు ఎప్పుడో మాట ఇచ్చారు. కానీ చివరి నిమిషంలో పొత్తుల సమీకరణాల్లో భాగంగా ఈ సీటు జనసేనకు వెళ్ళిపోయింది. దీంతో గుండెల్లో పసుపు రక్తం ఓడుతున్నా.. కార్యకర్తల పంతం కోసం, ఇచ్చిన మాట కోసం మణి శ్రీనివాస్ ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగాల్సి వచ్చింది.

రెబల్ అంటే విధ్వంసం కాదు.. ప్రజాబలం అని చాటిన 'మణి'!

పొత్తు అభ్యర్థి ఒకవైపు, అధికార బలగాలు మరోవైపు ఉన్నా.. 10వ వార్డు ఓటర్లు మాత్రం తాము నమ్మిన నాయకుడి వైపే నిలిచారు. ప్రచారంలో దూసుకెళ్లి, ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించి, ఊహించని విధంగా 217 ఓట్ల భారీ మెజార్టీతో మణి శ్రీనివాస్‌ను విజయలక్ష్మి వరించింది. టికెట్ రాకపోయినా స్వతంత్రుడిగా నిలబడి తన సత్తా ఏంటో, తన ప్రజాబలం ఏంటో నిరూపించి గొల్లప్రోలు రాజకీయాల్లోనే హాట్ టాపిక్‌గా నిలిచారు.

కార్యకర్తల పంతమే గెలిచింది!

గొల్లప్రోలు పట్టణంలో తెలుగుదేశం పార్టీకి గుండెకాయ లాంటి వార్డు

ఎన్నికలయ్యాక మైండ్ బ్లోయింగ్ ట్విస్ట్.. నా జెండా, నా అజెండా టిడిపినే!

గెలిచిన తర్వాత మణి శ్రీనివాస్ ఏ పార్టీలోకి వెళ్తారనే ఉత్కంఠకు తెర దించుతూ ఆయన సంచలన ప్రకటన చేశారు. తన గెలుపుకు రాత్రింబగళ్లు కష్టపడిన ప్రతి ఒక్క కార్యకర్తకు శిరస్సు వంచి ధన్యవాదాలు తెలుపుతూ.. తాను పుట్టింది, పెరిగింది, రాజకీయంగా బతికేది తెలుగుదేశం పార్టీలోనేనని స్పష్టం చేశారు. పొత్తుల వల్ల సీటు చేజారినా, తన ఊపిరి టిడిపియేనని, చంద్రబాబు నాయుడు నాయకత్వంలోనే వార్డు అభివృద్ధికి కట్టుబడి ఉంటానని తేల్చి చెప్పారు. ఈ సంచలన ప్రకటనతో అటు టిడిపి క్యాడర్‌లో సరికొత్త జోష్ నెలకొంది. మొత్తానికి గొల్లప్రోలు 10వ వార్డులో రెబల్ గెలుపు.. ఇప్పుడు టిడిపి ఖాతాలోకే చేరడంతో పసుపు శ్రేణులు పండగ చేసుకుంటున్నాయి.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

కక్షిదారులకు అవగాహన కల్పించి సహకరించాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి



ప్రజా జ్యోతి నందికొట్కూరు స్థానిక నందికొట్కూరు కోర్టు ఆవరణంలో ఈనెల 12వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌పై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి, సీనియర్ సివిల్ జడ్జి ఏ. శోభారాణి ఆధ్వర్యంలో నందికొట్కూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు, పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ డిసెంబర్ 12, 2026 శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. రాజీకి అవకాశం ఉన్న సివిల్, క్రిమినల్ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని, తద్వారా కక్షిదారులు శాశ్వత పరిష్కారం పొందవచ్చని తెలిపారు.నందికొట్కూరు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఈ అవకాశంపై న్యాయవాదులు, పోలీస్ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. కక్షిదారులకు లోక్ అదాలత్ ప్రయోజనాలను వివరించి, కేసుల పరిష్కారానికి సహకరించడం ద్వారా జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు.ఈ సదవకాశాన్ని నందికొట్కూరు పరిసర ప్రాంతాల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లోక్ అదాలత్‌కు సంబంధించిన సందేహాలు, వివరాల కోసం మండల న్యాయ సేవాధికార సంస్థ, నందికొట్కూరును సంప్రదించాలని తెలిపారు.ఈ సమావేశంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు, పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఐవీ నియంత్రణ లక్ష్యాల సాధనలో బాపట్ల జిల్లా ముందడుగు

వైద్య ఆరోగ్య శాఖ అధికారులను అభినందించిన కలెక్టర్ వినోద్ కుమార్



బాపట్ల నవంబర్ 10 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)హెచ్ఐవీ వ్యాప్తి నియంత్రణతో పాటు బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో సమష్టి కృషి అవసరమని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ సూచించారు. మొబిలైజ్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమంలో భాగంగా హెచ్ఐవీ నివారణకు నిర్దేశించిన, ఒకట 95, మూడు 95 లక్ష్యాలను సాధించిన బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను మంగళవారం ఆయన అభినందించారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వారిలో 95 శాతం మందిని గుర్తించడం మొదటి లక్ష్యం కాగా, చికిత్స పొందుతున్న వారిలో 95 శాతం మందికి వైరల్ లోడ్‌ను నియంత్రణలోకి తీసుకురావడం మూడో లక్ష్యమని కలెక్టర్ వివరించారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ హెచ్ఐవీ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు.హెచ్ఐవీ బాధితులను ముందస్తుగా గుర్తించడం, యాంటీ రెట్రోవైరల్ థెరపీ (ఏ ఆర్ టి) చికిత్సపై అవగాహన కల్పించడం, నాణ్యమైన వైద్య సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఈ లక్ష్యాల సాధనలో కృషి చేసిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ సోమల నాయక్, ఎయిడ్స్ నివారణ సంస్థ సిబ్బంది, సంబంధిత ఎన్జీవోలు, కేర్ అండ్ సపోర్ట్ సెంటర్ల ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు.

కూటమి అభ్యర్థులకు ప్రజల పట్టం అభినందనీయం

అభివృద్ధికి ప్రజల మద్దతే నిదర్శనం. సలగల రాజశేఖర్ బాబు



బాపట్ల నవంబర్ 10 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)బాపట్ల జిల్లాలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు విశేష మద్దతు తెలిపి విజయాన్ని అందించడం అభినందనీయమని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సలగల రాజశేఖర్ బాబు తెలిపారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి సాధించిన ఫలితాలు ప్రజల విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు.జిల్లాలో మొత్తం 300 ఎంపీటీసీ స్థానాలకు గాను 247 స్థానాల్లో, 20 జడ్పీటీసీ స్థానాలకు గాను 18 స్థానాల్లో కూటమి అభ్యర్థులను ప్రజలు గెలిపించడం శుభపరిణామమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు అర్థం చేసుకుని కూటమి నాయకత్వానికి పట్టం కట్టారని తెలిపారు.ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి కూటమి అభ్యర్థుల విజయానికి విశేష కృషి చేశారని, వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. చిన్నగంజాం జడ్పీటీసీగా నక్కల వెంకటరమణ, అద్దంకి జడ్పీటీసీగా శ్రీనివాసరావు విజయం సాధించడం ఎంతో గర్వకారణమన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలకు కూటమి ప్రజాప్రతినిధులు ప్రాధాన్యత ఇవ్వాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లం గోపి, చిన్నగంజాం జడ్పీటీసీ నక్కల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండలో ప్రధాన రహదారి పక్కన డ్రైనేజీ లేక దుర్వాసనతో అవస్థలు.



ప్రజా జ్యోతి న్యూస్ ప్రతినిధి.దేవనకొండ (ఎ.రాఘవేంద్ర). ఈ రహదారి వెంబడి వెళ్లాలంటే నరకం కనబడుతుశీది. దేవనకొండ నుండి కర్నూలు వెళ్లే ప్రధాన రహదారి పక్కన డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగునీరు నిల్వ ఉండి స్థానికులు నరకం చూపిస్తుందనిస్థానికులు వాపోతున్నారు. ఈ ప్రధాన రహదారి వెంబడి చెత్తాచెదారం పేరుకుపోయి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి విపరీతమైన దుర్వాసనతో పాటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి మురికి కాలువలు నిర్మించి. పారశుధ్య సమస్యను పరిష్కరించాలని కోరుచున్నారు.

కత్తితో ఆటో డ్రైవర్‌పై దాడి.. ప్రయాణికుల బంగారు ఆభరణాల దోపిడీ

--ఇద్దరు నిందితులకు 10 ఏళ్ల 6 నెలల జైలు శిక్ష.. ఒక్కొక్కరికి జరిమానా

--పిఠాపురం అసిస్టెంట్ సెషన్స్ కోర్టు తీర్పు.. పోలీసుల దర్యాప్తు, ప్రాసిక్యూషన్‌కు ఎస్పీ అభినందనలు



కాకినాడ జిల్లా నవంబర్ 10(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్) కాకినాడ జిల్లాలో ఆటోలో ప్రయాణికులుగా నటించి, ఆటో డ్రైవర్‌పై కత్తితో దాడి చేసి, ప్రయాణికుల వద్ద ఉన్న బంగారు ఆభరణాలను దోచుకున్న ఇద్దరు నిందితులకు పిఠాపురం అసిస్టెంట్ సెషన్స్ కోర్టు పదేళ్ల ఆరు నెలల చొప్పున జైలు శిక్ష విధించింది. ఒక్కొక్కరికి రూ.1,000 జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం. బాబు తీర్పు వెలువరించారు. 2023 జూన్ 12న పిఠాపురం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆటోలో ప్రయాణికులుగా ఎక్కిన నిందితులు, అనంతరం ఆటో డ్రైవర్‌పై కత్తితో దాడి చేసి గాయపరిచారు. ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికులను కత్తితో బెదిరించి వారి బంగారు ఆభరణాలను దోచుకుని పరారయ్యారు. బాధితురాలు అప్పికొండ మంగ ఇచ్చిన ఫిర్యాదుతో పిఠాపురం రూరల్ పోలీసులు క్రైమ్ నంబర్ 98/2023గా కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన కైలాష్ భగ్ అలియాస్ సన్నీ (28), ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సునెల్ సాహు అలియాస్ బాలికరణ్ సాహు (45) నిందితులుగా ఉన్నారు. అప్పటి పిఠాపురం రూరల్ ఎస్ఐ అబ్దుల్ నబీ కేసు నమోదు చేయగా, అప్పటి పిఠాపురం సీఐ వై.ఆర్.కె. శ్రీనివాస్ దర్యాప్తు చేపట్టారు. పటిష్టమైన సాక్ష్యాధారాలు సేకరించి న్యాయస్థానంలో సమర్పించడంతో పాటు, ప్రాసిక్యూషన్ సమర్థవంతమైన వాదనలు వినిపించడంతో ఎస్సీ నంబర్ 179/2024లో ఇద్దరు నిందితులకు జైలు శిక్ష ఖరారైంది. పోలీసుల తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. లక్ష్మణ దొర వాదనలు వినిపించారు. కోర్టు విచారణ సమయంలో నిందితులను హాజరుపరచడం, న్యాయపరమైన ప్రక్రియలను సమన్వయం చేయడంలో ప్రస్తుత పిఠాపురం సీఐ జి.వి.వి. సత్యనారాయణ, పిఠాపురం రూరల్ ఎస్ఐ షేక్ జాన్ భాషా, కోర్టు హెడ్ కానిస్టేబుల్ వి.వి.వి. కిషోర్ కీలకంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా కేసు దర్యాప్తు చేసిన అప్పటి సీఐ వై.ఆర్.కె. శ్రీనివాస్, కేసు నమోదు చేసిన అప్పటి ఎస్ఐ అబ్దుల్ నబీ, ఏపీపీ బి. లక్ష్మణ దొరతో పాటు ప్రస్తుత సీఐ జి.వి.వి. సత్యనారాయణ, ఎస్ఐ షేక్ జాన్ భాషా, కోర్టు హెడ్ కానిస్టేబుల్ వి.వి.వి. కిషోర్‌లను కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

చొప్పెల్లలో ఘనంగా మహా అన్నసంతర్పణ,7 వేల మందికి పైగా భక్తులకు అన్నప్రసాద వితరణ

ఆలమూరు, నవంబర్ 10 (ప్రజాజ్యోతి): ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మంగళవారం మహా అన్నసంతర్పణ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ శారదాదేవి అమ్మవారి నవరాత్రి మహోత్సవాల ముగింపు అనంతరం దాతల సహాయ సహకారాలతో ఏర్పాటు చేసిన ఈ అన్నదాన కార్యక్రమానికి గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 7 వేల మందికి పైగా భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్తీకమాసంలో నిర్వహించిన తొలి అన్నసంతర్పణ కావడంతో కార్యక్రమానికి ముందు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆకుల శ్రీనివాస్ దంపతులు అమ్మవారికి లక్ష్మీ అష్టోత్తర శతనామావళి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వై. లక్ష్మీ నరసింహ ఆచార్యులు (బుజ్జిరావు) పౌరోహిత్యంలో వేదోక్త, శాస్త్రోక్త సంప్రదాయాల ప్రకారం పూజలు, అష్టోత్తర నామార్చన తదితర ధార్మిక కార్యక్రమాలు జరిగాయి. లోకక్షేమం, గ్రామ ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సకల శుభాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు.కార్తీకమాస పవిత్రతను దృష్టిలో ఉంచుకుని అన్నప్రసాద తయారీలో ప్రత్యేక సంప్రదాయాలను పాటించారు. వివిధ రకాల రుచికరమైన వంటకాలను ఉల్లిపాయలు వినియోగించకుండా సంప్రదాయ బద్ధంగా సిద్ధం చేయడం ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు



ప్రత్యేక ఏర్పాట్లు చేసి, క్రమపద్ధతిలో భోజనాలు వడ్డించారు.ఈ సందర్భంగా శ్రీ శారదాదేవి అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు, అనంతరం నిర్వహించిన అమ్మవారి ఊరేగింపు, మంగళవారం జరిగిన మహా అన్నసంతర్పణ కార్యక్రమాలు విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఉత్సవ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. ఉత్సవాల నిర్వహణకు విరాళాలు అందించిన దాతలకు, అమ్మవారి విగ్రహ ఏర్పాటుకు సహకరించిన దాతకు, అన్నసంతర్పణలో వివిధ వంటకాల (ఐటమ్స్) స్పాన్సర్‌లుగా నిలిచిన దాతలకు కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా అన్నప్రసాద వితరణ సమయంలో స్వచ్ఛందంగా ముందుకొచ్చి భక్తులకు భోజనాలు వడ్డించడంతో పాటు వివిధ సేవలు అందించిన సేవకుల కృషిని అభినందించారు.దాతల ఉదార సహకారం, సేవకుల అంకితభావం, గ్రామ ప్రజల భాగస్వామ్యంతో మహా అన్నసంతర్పణ కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని ఉత్సవ కమిటీ పేర్కొంది. భక్తి, సేవాభావం, గ్రామ ఐక్యతకు ఈ కార్యక్రమం ప్రతీకగా నిలిచింది.

కాలువల్లో పేరుకుపోయిన పూడిక తొలగింపునకు చర్యలు

పారిశుద్ధ్య కార్మికులతో కాలువల శుభ్రత పనులు చేపట్టిన కౌన్సిలర్ మహబూబ్ బాషా





ప్రజా జ్యోతి నందికొట్కూరు నందికొట్కూరు పట్టణంలో ట్యాంక్ ఏరియా పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ కాలువల్లో పేరుకుపోయిన పూడిక, చెత్తాచెదారాన్ని మంగళవారం తొలగించే పనులను చేపట్టారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో కాలువలు పూడికతో నిండిపోవడంతో మురుగునీరు సక్రమంగా ప్రవహించక స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ శుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ మహబూబ్ బాషా పారిశుద్ధ్య కార్మికులను సమన్వయం చేస్తూ కాలువల్లో పేరుకుపోయిన మట్టిపూడికను, వ్యర్థాలను తొలగించే పనులను పర్యవేక్షించారు కార్మికులు కాలువల్లోకి దిగి పూడికను బయటకు తీసి, మురుగునీరు సజావుగా ప్రవహించేలా శుభ్రం చేశారు. దీంతో కాలువల్లో నీరు నిలిచిపోవడం, దుర్వాసన వెదజల్లడం వంటి సమస్యలకు ఉపశమనం కలిగే అవకాశం ఉంది.పట్టణ పరిసరాలు పరిశుభ్రంగా ఉండటం ప్రజల ఆరోగ్యానికి ఎంతో అవసరమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ అనేది ఒక్కరోజుతో ముగిసే కార్యక్రమం కాదని, నిరంతరం కొనసాగించాల్సిన బాధ్యత అని తెలిపారు. కాలువల్లో చెత్తాచెదారం వేయకుండా ప్రజలు కూడా సహకరించాలని కోరారు.అలాగే వార్డుల్లో పారిశుద్ధ్య సమస్యలు గుర్తించిన వెంటనే సంబంధిత సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలని, మురుగునీటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు కాలువలను శుభ్రం చేయాలని సూచించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.

దల్లవలస ప్రధాన రహదారిపై చెరువును తలపిస్తున్న మురుగునీరు

- దుర్వాసనతో ప్రజల అవస్థలు
- కాలువ సదుపాయం లేక రోడ్డుపైనే నిలిచిపోతున్న మురుగునీరు
- పంచాయతీ అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలంటూ గ్రామస్తుల ఆందోళన

పొందూరు,ప్రజా జ్యోతి న్యూస్ :పొందూరు మండలం దల్లవలస పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య సమస్య ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. గ్రామంలోని ప్రధాన రహదారిపై డ్రైనేజీ నీరు నిలిచిపోవడంతో రహదారి చెరువును తలపిస్తోంది. మురుగునీరు బయటకు వెళ్లేందుకు సరైన కాలువ సదుపాయం లేకపోవడంతో నీరంతా రోడ్డుపైనే నిల్వ ఉంటోంది. దీంతో నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.రహదారిపై రోజుల తరబడి మురుగునీరు నిలిచిపోవడంతో పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.రహదారిపై నీరు నిల్వ ఉండటంతో గుంతలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో నెలకొన్న ఈ సమస్యపై సంబంధిత పంచాయతీ అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ ఇప్పటివరకు సరైన స్పందన లేదని స్థానికులు వాపోతున్నారు. కనీస డ్రైనేజీ సదుపాయం కల్పించకపోవడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించి ప్రధాన రహదారిపై నిలిచిన డ్రైనేజీ నీటిని తొలగించాలని, మురుగునీరు సాఫీగా వెళ్లేందుకు అవసరమైన కాలువ నిర్మాణం చేపట్టాలని దల్లవలస గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రధమనందిలో అన్నప్రసాద వితరణ చండీ హోమంలో పాల్గొన్న కలెక్టర్ రాజకుమారి



నంద్యాల, నవంబర్, 10 ప్రజాజ్యోతి కార్తీక మాసం ఆధ్యాత్మిక విశిష్టతను చాటుతూ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా పిలుపునిచ్చారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని ప్రసిద్ధ ప్రధమనంది ఆలయంలో కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన చండీ హోమంలో కలెక్టర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు కార్తీక మాస శుభాకాంక్షలు తెలియజేశారు. కార్తీక మాసం ఆధ్యాత్మిక చింతనకు, దైవారాధనకు ఎంతో పవిత్రమైనదని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించుకుని ఆధ్యాత్మిక ప్రశాంతతను పొందాలని ఆకాంక్షించారు. ఆలయానికి వచ్చే భక్తులకు అన్నప్రసాద వితరణ ఎంతో ఉపయోగకరమని, అన్నదానం మహోన్నతమైన సేవా కార్యక్రమమని పేర్కొన్నారు. భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్తీక మాసోత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని తెలిపారు.

సమర్థ్ యాప్‌తో పోలీసులకు వేగవంతమైన సమాచార వ్యవస్థ



బాపట్ల నవంబర్ 10 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)ఎన్నికల విధుల్లో పోలీసుల మధ్య సమాచార సమన్వయాన్ని మరింత వేగవంతం చేసేందుకు సమర్థ్ మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. ఈ యాప్ వినియోగంపై మంగళవారం చీరాల సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బందికి జిల్లా ఐటీ కోర్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ నిర్వహించారు.ఎన్నికల విధుల్లో ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్ నొక్కడం ద్వారా సమీపంలోని పోలీస్ సిబ్బందితో పాటు జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఉన్నతాధికారులకు తక్షణ సమాచారం చేరుతుందని ఎస్పీ వివరించారు. విధుల్లో ఉన్న సిబ్బంది ప్రస్తుత స్థానం, సమీప పోలీసుల దూరం, వారు వస్తున్న దిశ, అధికారి పేరు, హోదా వంటి వివరాలను రియల్ టైమ్‌లో తెలుసుకునే అవకాశం ఉందన్నారు.ఇప్పటికే మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ఈ యాప్‌ను వినియోగించామని రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ మరింత సమర్థవంతంగా ఉపయోగించనున్నట్లు తెలిపారు. ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది తమ మొబైల్‌లో యాప్‌ను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. రేపల్లె, బాపట్ల సబ్ డివిజన్లలోనూ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో చీరాల డీఎస్పీ ఎం.డి.మోయిన్, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ మహిళలకు ఉపాధి మార్గాలపై దిశానిర్దేశం



బాపట్ల నవంబర్ 10 (ప్రజా జ్యోతి జిల్లాప్రతినిధి) గ్రామీణ మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపడంతో పాటు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని పలువురు నిపుణులు సూచించారు. ఎన్.ఎస్.ఎస్ ప్రత్యేక శిబిరం ఆరవ రోజు పెదప్రోలు గ్రామంలో నిర్వహించిన మహిళా సాధికారత కార్యక్రమంలో 38 మంది మహిళలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డా. వి. శ్రీలత సమతుల్య ఆహారం, ఇంటి తోటల పెంపకం గురించి వివరించగా, డా. అబ్దుల్ సలాం పుట్టగొడుగుల పెంపకం ద్వారా ఆదాయం పొందే మార్గాలను వివరించారు. డా. జి. కృష్ణవేణి మహిళల ఆరోగ్యం, వ్యక్తిగత సంరక్షణపై అవగాహన కల్పించారు. మండవ సుధారావు, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్ కె. చంద్రిక మునగ సాగు, పోషక విలువలను వివరించగా, డా. ఎ. లలిత వ్యక్తిత్వ వికాసం, మహిళల స్వతంత్రతపై మాట్లాడారు. అనంతరం మహిళలకు మునగ, డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను పంపిణీ చేశారు. ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు మదర్ థెరిసా విగ్రహం పీఠానికి రంగులు వేయడంతో పాటు గ్రామంలోని ఆలయాన్ని శుభ్రం చేశారు.

ముఖ్యమంత్రి పర్యటన. భద్రతా ఏర్పాట్లపై ఎస్పీ పరిశీలన



గుంటూరు నవంబర్ 10 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి రాజధాని ప్రాంతంలో పర్యటించనున్న నేపథ్యంలో పోలీసు యంత్రాంగం భద్రతా ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఈ క్రమంలో గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీఎస్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి రాయపూడి పరిధిలోని నిర్మాణంలో ఉన్న జీఏడీ టవర్స్, హెచ్ఓడీ టవర్స్‌ను మంగళవారం సందర్శించి భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ముఖ్యమంత్రి మధ్యాహ్నం మూడు గంటల ముప్పై నిమిషాల నుంచి నాలుగు గంటల మధ్య ఈ భవనాల నిర్మాణ పనులను పరిశీలించనున్నారు ఈ నేపథ్యంలో బందోబస్తు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ మళ్లింపు, రాకపోకల నియంత్రణ పై అధికారులు సమీక్షించారు. పర్యటన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు.ఈ కార్యక్రమంలో ఏపీసీఆర్డీఏ కమిషనర్ పి. విజయ రామరాజు, జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, అదనపు ఎస్పీ ఏటీవీ రవికుమార్, ఏపీసీఆర్డీఏ అదనపు కమిషనర్ రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాసరావు, ఎస్పీ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, తుళ్లూరు ఎస్‌డీపీఓ మురళీకృష్ణ, ఎస్ఎస్‌జీ డీఎస్పీ రఘుబాబు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కత్తిపూడిలో వైసీపీకి షాక్.. టీడీపీలో చేరిన 20 కుటుంబాలు

--ఎమ్మెల్యే సత్యప్రభ సమక్షంలో వెన్నా శివ ఆధ్వర్యంలో పార్టీలో చేరిక..

పసుపు కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



కాకినాడ జిల్లా నవంబర్ 10(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్) కాకినాడ జిల్లా, ప్రత్తిపాడు నియోజకవర్గం, శంఖవరం మండలం కత్తిపూడి గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 20 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ, శంఖవరం మండల నూతన జడ్పీటీసీ కంచిబోయిన శ్రీను ఆధ్వర్యంలో మాజీ ఎంపీటీసీ సింగంపల్లి రాంబాబు, బొడ్డపు రాంబాబు, నమ్మి సత్యనారాయణ, పెదపాటి ఆనంద్, పంచదార్ల రమణ నేతృత్వంలో ఆయా కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా పెదశంకర్లపూడిలోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా వారికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీపై నమ్మకంతో, కూటమి ప్రభుత్వ పాలనపై విశ్వాసంతో పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ ఆమె హృదయపూర్వక స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప నాయకత్వంలో కొనసాగుతున్న సంక్షేమ, అభివృద్ధి పాలనే టీడీపీకి అసలైన బలమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కత్తిపూడిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నాయకులు, కార్యకర్తలను అభినందించారు. పార్టీలో ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, గుర్తింపు కల్పిస్తూ ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కత్తిపూడి అధ్యక్షుడు గాబు కృష్ణమూర్తి, మాజీ ఎంపిటిసి సాధనాల లక్ష్మీ బాబు, కత్తిపూడి గ్రామ టిడిపి అధ్యక్షుడు కేళంగి జన, దేశీలంక వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి



నంద్యాల:నవంబర్=10 ప్రజాజ్యోతి అయ్యలూరు మెట్ట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాద స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ....స్థానిక ప్రజలతో ప్రమాదానికి గల కారణాలపై ఆరా రహదారి భద్రతా నియమాలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలి....జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ ఐపిఎస్ నంద్యాల జిల్లా, నంద్యాల--ఆళ్లగడ్డ జాతీయ రహదారిపై అయ్యలూరు మెట్ట సమీపంలో నిన్న రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటనపై జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ ఐపిఎస్ సంఘటన స్థలాన్ని స్వయంగా సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ ప్రమాదానికి గల కారణాలు, రహదారిపై ఉన్న వాస్తవ పరిస్థితులు, ప్రమాదం జరిగిన తీరుపై స్థానిక ప్రజలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, ప్రమాదాలకు కారణమయ్యే అంశాలను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...

"రోడ్డు ప్రమాదాలలో అత్యధిక శాతం మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయి. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కారణంగా అమూల్యమైన ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రతి వాహనదారుడు రహదారి భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. వాహనాలను నిర్దేశిత వేగ పరిమితుల్లో నడపాలి. రాత్రి వేళల్లో మరింత అప్రమత్తంగా ప్రయాణించాలి. డ్రైవింగ్ సమయంలో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా, ఇతర వాహనదారులు మరియు పాదచారుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలి. రోడ్డు భద్రత అనేది ప్రతి ఒక్కరి బాధ్యత. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించి, ప్రాణాలను కాపాడుకోవచ్చు. ప్రతి ఒక్కరూ సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలి." అని జిల్లా ఎస్పీ ప్రజలకు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన పెంపొందించుకోవడంతో పాటు, ప్రతి ఒక్కరూ రహదారి భద్రతకు ప్రాధాన్యతనివ్వాలని జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ ఐపిఎస్ విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డితో ఎంపీటీసీ బోయ రాధమ్మ

గ్రామ పెద్దలతో కలిసి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఎంపీటీసీ

:-గ్రామ అభివృద్ధి అంశాలపై చర్చ!



కౌతాళం,నవంబర్ 10 ప్రజా జ్యోతి కౌతాళం మండలం బదినేహాల్ గ్రామ నూతన ఎంపీటీసీగా ఎన్నికైన బోయ రాధమ్మ గ్రామ పెద్దలతో కలిసి ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో గ్రామానికి సంబంధించిన అంశాల పై చర్చించారు. నూతన ఎంపీటీసీగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. గ్రామ అభివృద్ధి,ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు.ఈ భేటీలో గ్రామ పెద్దలు,సాయి గౌడ,వినోద్ గౌడ, ప్రసన్న గౌడ,లక్ష్మీకాంత, ఖాదర్ బాషా కురువ వెంకటేష్, తలారి పెద్ద బసన్న, కురిమల,చిన్న రెడ్డీప్ప, మలయ్య,రాఘవయ్య మరియు అత్రి గౌడ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

బాలిక ఆత్మహత్య కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

రూ.15 వేల జరిమానా విధించిన కడప పోక్సో ప్రత్యేక న్యాయస్థానం



చింతకొమ్మ దిన్నె ప్రజాజ్యోతి 10 /11/26 మైనర్ బాలిక ఆత్మహత్యకు కారణమైన కేసులో నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.15 వేల జరిమానా విధిస్తూ కడప పోక్సో ప్రత్యేక న్యాయస్థానం మంగళవారం తీర్పు వెలువరించింది.చింతకొమ్మదిన్నె పోలీస్‌స్టేషన్ పరిధిలో 2018 సెప్టెంబర్ 2న ఈ ఘటన చోటుచేసుకుంది. మైనర్ బాలిక, నిందితుడు బవిగడ్డ విష్ణుగోపాల్ (21) సహవిద్యార్థులు. బాలికపై లైంగిక దోపిడీకి పాల్పడటంతో ఆమె గర్భం దాల్చింది. తనను వివాహం చేసుకోవాలని బాలిక కోరగా నిందితుడు నిరాకరించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాలిక రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది.తొలుత కడప రైల్వే పోలీసులు కేసు నమోదు చేయగా, అనంతరం దర్యాప్తులో లభించిన ఆధారాల మేరకు చింతకొమ్మదిన్నె పోలీసులకు కేసు బదిలీ అయింది. ఐపీసీ 306, 376, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం, పోక్సో చట్టంలోని సెక్షన్ల కింద దర్యాప్తు చేపట్టి న్యాయస్థానంలో అభియోగాలు నమోదు చేశారు. విచారణ అనంతరం ఎస్.సి. నంబర్ 205/2022 కేసులో నిందితుడిని దోషిగా నిర్ధారించిన న్యాయస్థానం పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.15 వేల జరిమానా విధించింది. ఈ కేసులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొమ్మినేని వేణుగోపాల్ వాదనలు వినిపించగా, చింతకొమ్మదిన్నె పోలీస్‌స్టేషన్ కోర్టు హెడ్ కానిస్టేబుల్ మిద్దె పుల్లయ్య (హెచ్‌సీ-643) కేసు పర్యవేక్షణలో సహకరించారు.

మండల కేంద్రమైన కౌతాళంలో బంగారు షాప్ లో లక్ష్మీ పూజకు హాజరైన చెన్న బసప్ప



కౌతాళం,నవంబర్ 10 ప్రజా జ్యోతి మండల కేంద్రమైన కౌతాళంలో ఆంధ్రజ్యోతి మాజీ విలేకరి లక్ష్మణ ఆచారి ఆహ్వానం మేరకు దీపావళి పూజా కార్యక్రమానికి ఉరుకుంద ఈరన్న మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ చెన్న బసప్ప ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ముందుగా షాప్ యాజమాన్యం,లక్ష్మణ ఆచారి చెన్న బసప్పకి ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా దీపావళి పూజా కార్యక్రమం నిర్వహించారు. దీపం వెలిగించి,అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి షాప్ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా చెన్న బసప్ప మాట్లాడుతూ దీపావళి అంటేనే చీకటిని తొలగించి వెలుగులు నింపే పండుగ అని, వ్యాపారస్తులకు లక్ష్మీదేవి అనుగ్రహంతో మంచి లాభాలు రావాలని కోరుకుంటున్నానని అన్నారు.కౌతాళం ప్రాంత ప్రజల ఆదరాభిమానాలకు ఎప్పుడూ రుణపడి ఉంటానని తెలిపారు.

నూతనంగా ఎన్నికైన జడ్పిటిసి ఉలిగయ్యని సన్మానించిన కౌతాళం టౌన్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజానందు,సొసైటీ చైర్మన్ వెంకటపతి రాజు,కురువ వీరేష్



కౌతాళం,నవంబర్ 10 ప్రజా జ్యోతి కౌతాళం మండల కేంద్రానికి విచ్చేసిన నూతనంగా ఎన్నికైన జడ్పిటిసి ఉలిగయ్యని కౌతాళం టౌన్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజా నందు తన స్వగృహానికి ఆహ్వానించి సన్మానించారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గత వారంలో వెలువడిన జడ్పిటిసి మరియు ఎంపీటీసీ ఫలితాలు పార్టీకి నాయకులకు మరియు కార్యకర్తలకు నూతన ఉత్సాహాన్ని కలిగించాయని మరియు ఇలాంటి విజయాలు మరెన్నో లభించాలని తెలిపారు. కౌతాళం మండల కేంద్రంలో మూడు ఎంపీటీసీ స్థానాలకు మూడు కైవసం చేసుకోవడం వెనక సొసైటీ చైర్మన్ అల్లూరు వెంకటపతి రాజు, మండల ఉపాధ్యక్షులు కురువ వీరేష్ కృషి మరువలేనిదని తెలుపుతూ వారిని సన్మానించారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఉలిగయ్య,సొసైటీ చైర్మన్ వెంకటపతి రాజు, మండల ఉపాధ్యక్షులు కురువ వీరేశ్,కౌతాళం టౌన్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజా నందు,మండల రైతు అధ్యక్షుడు గిరి, నాయకులు లక్కీ గోవిందు, రమేష్ మరియు గొట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

స్తూవర్తుపురం ఎంపీటీసీగా గాజుల రజిత విజయం



బాపట్ల నవంబర్ 10 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) స్తూవర్తుపురం రాజకీయ చరిత్రలో తొలిసారిగా తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన గాజుల రజిత విజయం సాధించి చరిత్ర సృష్టించారు. ఈ నేపథ్యంలో నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ గాజుల రజిత మంగళవారం బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీటీసీ వ్యవస్థ ప్రారంభమైనప్పటి నుంచి స్తూవర్తుపురంలో టీడీపీ అభ్యర్థి విజయం సాధించడం ఇదే తొలిసారి కావడంతో పార్టీ శ్రేణుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా తన విజయానికి సహకరించి అండగా నిలిచిన ఎమ్మెల్యేకు రజిత కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు నూతన ఎంపీటీసీని శాలువాతో సత్కరించి అభినందించారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బిజెపి కౌన్సిలర్ కు సన్మానం



గుంతకల్లు నవంబర్ 10 (ప్రజా జ్యోతి): గుంతకల్లు మున్సిపల్ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ 4వ వార్డు కౌన్సిలర్ గా మొండ్ల మహాలక్ష్మి గెలుపొందడంతో మంగళవారం సివిఆర్ న్యూస్ రిపోర్టర్ లోకనాథ్, పోలా మరియు వారి మిత్రబృందం కౌన్సిలర్ మహాలక్ష్మి ఇంటికి వెళ్లి ఆమెను ఆమె పుత్రుడు బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షు లు మొండ్ల కేశవ కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

జాతీయ ,అంతర్జాతీయ క్రీడలకు ఎంపికైన విద్యార్థులకు సత్కారం



తాళ్లపూడి, నవంబర్ 10, ప్రజాజ్యోతి న్యూస్ ఆటలు శారీరక, మానసిక స్థితిని పెంచడానికి సహాయపడతాయని, పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న శంకారపు భార్గవ్ సూర్య జంప్ రోప్ ఆటలో జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి అంతర్జాతీయ స్థాయికి ఎంపిక కావడం చాలా సంతోషకరమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని సి.హెచ్. సుబ్బలక్ష్మి అన్నారు.ఈ సందర్భంగా విద్యార్థికి షీల్డ్, దుశ్శాలువా, బహుమతులు ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ గుండుబోగుల పద్మ కుమారి, వ్యాయామ ఉపాధ్యాయిని ధనలక్ష్మి, ఉపాధ్యాయినులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.జాతీయ స్థాయి పోటీకి ఎంపికైన కేశవ, స్నేహ దీపికలకు కూడా బహుమతులు ప్రదానం చేశారు. అంతర్జాతీయ స్థాయి పోటీ థాయిలాండ్ లో జరగనుంది

పొనకలదిన్నెగ్రామ అభివృద్ధికి కృషి చేస్తా- టీడీపీ ఎంపీటీసీ గొల్ల రాధమ్మ



నందవరం, నవంబర్ 10 (ప్రజా జ్యోతి): మండల పరిధిలోని పొనకలదిన్నె గ్రామ ఎంపీటీసీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన గొల్ల శ్రీరాములు సతీమణి గొల్ల రాధమ్మ తన సమీప ప్రత్యర్థిపై 156 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి గెలిపించిన గ్రామ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే డా. బీవీ జయనాగేశ్వర రెడ్డి సహకారంతో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఒకే అరటి గెలలో మూడు కాయలు.. ప్రకృతి అద్భుతం!

కౌతాళంలో రజక భాగ్య పురుషోత్తం ఇంటి పెరట్లో అరుదైన దృశ్యం..


త్రయంబకేశ్వర ఆలయంలో ప్రత్యేక నైవేద్యం



కౌతాళం, నవంబర్ 10 ప్రజా జ్యోతి ప్రకృతి సృష్టిలో ఎన్నో వింతలు, విశేషాలు దాగి ఉంటాయనడానికి కౌతాళం మండల కేంద్రంలో కనిపించిన అరుదైన అరటి గెల నిదర్శనంగా నిలిచింది. స్థానికంగా నివాసం ఉంటున్న రజక భాగ్య పురుషోత్తం ఇంటి పెరట్లోని అరటి చెట్టుకు ఒకే చోట మూడు అరటి కాయలు కలిసిన ఆకృతిలో పెరగడం చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది. సాధారణంగా అరటి గెలల్లో కాయలు గుత్తులుగా ఏర్పడటం సహజం. అయితే మూడు అరటి కాయలు ఒకే ఆకృతిలో కలిసినట్లుగా కనిపించడంతో ఈ దృశ్యం ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఈ అరుదైన ఆకృతిని చూసిన కుటుంబ సభ్యులు, స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.ఇదిలా ఉండగా, కార్తీక మాసం తొలి రోజు, దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ మూడు అరటి ఫలాలను కౌతాళం గ్రామంలోని శ్రీ భ్రమరాంబ సమేత త్రయంబకేశ్వర స్వామి ఆలయంలో నైవేద్యంగా సమర్పించి భక్తితో దర్శించుకున్నారు. ప్రకృతి ప్రసాదించిన ఈ అరుదైన ఫలాలను ఆలయంలో నైవేద్యంగా సమర్పించడం స్థానికంగా ఆసక్తికరంగా మారింది.ఒకే అరటి గెలలో మూడు కాయలు ప్రత్యేక ఆకృతిలో కనిపించడం ప్రకృతి వైవిధ్యానికి నిదర్శనంగా నిలుస్తూ పలువురి దృష్టిని ఆకర్షిస్తోంది.

అధ్యక్షుల ఎన్నికల షెడ్యూల్ విడుదల

ఎంపీపీలు, జడ్పీ అధ్యక్షుల పరోక్ష ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించింది. ఈ నెల 19న 659 మండల పరిషత్లలో ఎంపీపీ, ఉపాధ్యక్ష పదవులకు, 20న 28 జిల్లా పరిషత్లలో ఛైర్పర్సన్, వైస్ ఛైర్పర్సన్ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు తొలుత ఎంపీపీల్లో ఒక్కొక్కరు జడ్పీల్లో ఇద్దరు చొప్పున కో-ఆప్షన్ సభ్యులను ఎన్నుకోనున్నారు. ఓటు హక్కు ఉండదని స్పష్టం చేసింది.



A.P. STATE ELECTION COMMISSION
1st Floor, New HQOs Building, M.G. Road, Vijayawada-520010

No.1750/SEC-B1/2026-1 Date:10.11.2026

NOTIFICATION

In exercise of the powers conferred under Section 200 and 201 of the Andhra Pradesh Panchayat Raj Act, 1994 and the Andhra Pradesh Conduct of Election of Member (Co-opted), President and Vice-President of Mandal Praja Parishad and Members (Co-opted), Chairperson and Vice-Chairperson of Zilla Praja Parishad Rules, 2006 issued in G.O.Ms.No.173, P.R. & R.D. (Elections) Department, dt.10.05.2006, the State Election Commission, hereby, directs all the Collectors & District Election Authorities to authorize a Gazetted Officer of the Government for each of the Mandal Praja Parishad in their jurisdiction to convene Special Meeting to conduct election of Member (Co-opted), President and Vice-President for the Mandal Praja Parishad, in accordance with the procedure laid down in the said Rules and specifies the schedule for the elections to the said offices in the Annexure appended.

Sd/- Anil Chandra Punetha, IAS (Retd)
State Election Commissioner

To
All the Collectors & District Election Authorities.

Copy to:
All the Chief Executive Officers of Zilla Praja Parishads.
All the General & Expenditure Observers.
The Commissioner of PR & RD and Election Authority.
The Special Chief Secretary to Government, PR & RD Department.

// Attested //
Joint Director

నియోజకవర్గ పార్టీ పెద్దలకు నామా కొండబాబు గౌరవ సత్కారం









తాళ్లపూడి, నవంబర్ 10, ప్రజాజ్యోతి న్యూస్ ఇటీవల జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఫలితాల్లో తాళ్లపూడి మండలానికి చెందిన కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా తాడిపూడి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సొసైటీ అధ్యక్షులు నామా కొండబాబు నియోజకవర్గ పెద్దలు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పెండ్యాల అచ్చిబాబు, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమని రామకృష్ణ,మద్దిపట్ల శివరామకృష్ణ, జనసేన ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావులను మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇంతటి ఘన విజయాన్ని అందించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. పెద్దల మార్గదర్శకత్వం, కూటమి శ్రేణుల కృషి వల్లనే ఈ విజయం సాధ్యమైందని, కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు ఉన్న నమ్మకమే ఫలితాల్లో కనిపించిందని ఆయన అన్నారు. తాడిపూడి గ్రామ అభివృద్ధికి, తాళ్లపూడి మండల అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. అదే సమయంలో తన సతీమణిని ఎంపీపీ అభ్యర్థిగా ప్రకటించినందుకు పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయంతో తాడిపూడి గ్రామంతో పాటు మండలంలో కూటమి శ్రేణుల్లో మరింత ఉత్సాహం నెలకొందని తన సతీమణి విజయం కోసం కూటమి నాయకులు కార్యకర్తలందరూ కలిసి కృషి చేశారని ఆయన తెలిపారు. అనంతరం పెద్దలు మాట్లాడుతూ తాడిపూడి గ్రామంలో పార్టీ బలోపేతానికి కూటమి విజయానికి కొండబాబు చేస్తున్న కృషిని అభినందించారు. ఆయన అనుభవం, కార్యకర్తలతో ఉన్న సన్నిహిత సంబంధం పార్టీకి ఎంతో బలమని ఆయన సహకారంతో మున్ముందు కూడా గ్రామంలో, మండలంలో కూటమిని మరింత బలోపేతం చేస్తామని, ఎంపీపీ ఎన్నికలో కూడా ఘన విజయం సాధిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత నాయకులు నామా సురేంద్ర కుమార్, సిద్ధన రాధాకృష్ణ,పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

సరుబుజ్జిలి ఎంపీటీసీ గా కిల్లి రమాదేవి ఘన విజయం





- ప్రజల మద్దతుతో
- ప్రత్యర్థిపై అఖండ మెజారిటీతో గెలుపు..
- పార్టీ శ్రేణుల్లో వెల్లివిరిసిన ఆనందం
- కిల్లి సత్యనారాయణకు గ్రామస్తులు ఘన సత్కారం
- కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజల పట్టం కట్టారు
- గతంలో జగనన్న చేసిన అభివృద్ధే శ్రీరామరక్ష
- వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకట గోపాల సత్యన్నారాయణ

పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్:ఆమదాలవలస నియోజకవర్గ పరిధిలోని సరుబుజ్జిలి మండల ఎంపీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కిల్లి రమాదేవి ఘన విజయం సాధించారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో కొనసాగుతున్నప్పటికీ, స్థానిక ఎన్నికల్లో ప్రత్యర్థి అభ్యర్థిపై అఖండ మెజారిటీతో గెలుపొందడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.ఈ విజయంతో సరుబుజ్జిలి మండలంలో వైఎస్సార్సీపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.

రాజకీయ అనుభవం కలిగిన కుటుంబం నుంచి..

కిల్లి రమాదేవి రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబం నుంచి వచ్చారు. ఆమె భర్త కిల్లి వెంకట వేణుగోపాల సత్యనారాయణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగడంతో పాటు విజయనగరం జిల్లా పార్లమెంటరీ పరిశీలకులుగా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. రాజకీయంగా సుదీర్ఘ అనుభవం కలిగిన కుటుంబం నుంచి వచ్చిన రమాదేవి స్థానిక ఎన్నికల బరిలో నిలిచి విజయం సాధించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ప్రజాదరణ.. నాయకులు, కార్యకర్తల సహకారం

ఎన్నికల ప్రచార సమయంలో స్థానిక ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగిన రమాదేవికి ఓటర్ల నుంచి మద్దతు లభించింది. కుటుంబ రాజకీయ అనుభవంతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయం, స్థానికంగా లభించిన ఆదరణ ఆమె విజయానికి దోహదపడ్డాయని వైఎస్సార్సీపీ శ్రేణులు పేర్కొన్నారు.

పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు

కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్సీపీ అభ్యర్థిగా కిల్లి రమాదేవి విజయం సాధించడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఆమె గెలుపు పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. కిల్లి వెంకట సత్యన్నారాయణ పార్టీ కోసం ,ప్రజా సమస్యల పరిష్కారానికి, గ్రామాల అభివృద్ధికి చేసిన కృషి నేడు ఆయనకు విజయావకాశాలు దక్కేలా చేసింది. ఈ మేరకు పార్టీ శ్రేణులు కిల్లి సత్యనారాయణకు శాలువాతో ఘనంగా సత్కరించారు.

రానున్న సర్పంచ్ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యం కావాలి

రానున్న సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసే వైసీపీ అభ్యర్థుల గెలుపే ప్రతీ ఒక్క కార్యకర్త లక్ష్యం కావాలని సత్యన్నారాయణ పేర్కొన్నారు. పార్టీ నాయకులు , కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి పార్టీ బలపరిచిన అభ్యర్థి విజయానికి తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు. గతంలో పార్టీ అధినేత , మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధే మనకు శ్రీరామరక్ష అని పేర్కొన్నారు.

పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి విజయమే లక్ష్యం

జడ్పీటీసీ, ఎంపీటీసీ విజేతలకు ఎమ్మెల్యే ఏలూరి అభినందన


పర్చూరు నవంబర్ 10(ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సాధించిన విజయాన్ని కొనసాగిస్తూ రానున్న పంచాయతీ ఎన్నికల్లోనూ వంద శాతం ఫలితాలు సాధించేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సూచించారు. నియోజకవర్గంలోని ఆరు జడ్పీటీసీ, 70 ఎంపీటీసీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించడం ప్రజల ఆదరణకు నిదర్శనమని చెప్పారు అధికారంలో ఉన్నప్పటికీ ఎక్కడా అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు.పర్చూరులో నిర్వహించిన విజయోత్సవ అభినందన సభలో నూతనంగా ఎన్నికైన జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు పదవులను హోదాగా భావించకుండా ప్రజలకు సేవ చేసే బాధ్యతగా స్వీకరించాలని పేర్కొన్నారు. ఓటు వేసిన వారితో పాటు వేయని వారిని కూడా సమానంగా గౌరవిస్తూ గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఎన్నికల్లో సాధించిన విజయం నాయకులు, కార్యకర్తల సమష్టి కృషి ఫలితమని, పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని వెల్లడించారు. మురసు తుఫాను సమయంలో ప్రజలకు అండగా నిలిచి విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. నియోజకవర్గంలో డ్రైనేజీ సమస్యల శాశ్వత పరిష్కారంతో పాటు గుంటూరు ఛానల్ విస్తరణ, ఎత్తిపోత పథకాల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో సమష్టి కృషితో



విజయపతాకం ఎగురవేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గుంజి వెంకట్రావు, బాపట్ల పార్లమెంట్ కమిటీ నాయకులు, ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు, నూతనంగా ఎన్నికైన జడ్పీటీసీ సభ్యులు, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల డైరెక్టర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాల్లో అధికారుల తనిఖీలు

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: డాక్టర్ గంగాధర్



గుంతకల్లు నవంబర్ 10 (ప్రజా జ్యోతి): గర్భస్థ శిశువు లింగ నిర్ధారణను అరికట్టడంతో పాటు పీసీపీఎన్‌డీటీ చట్ట నిబంధనలు పక్కాగా అమలయ్యేలా గుంతకల్ పట్టణంలోని పలు స్కానింగ్ కేంద్రాల్లో మంగళవారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. పట్టణం లోని రైల్వే హాస్పిటల్, స్వప్న నర్సింగ్ హోమ్, పల్స్ క్లినిక్ స్కానింగ్ కేంద్రాలను వైద్య అధికారి డాక్టర్ గంగాధర్ సందర్శించి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఫారం-ఎఫ్ రికార్డులు, రిజిస్టర్లు, ఇతర సంబంధిత పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్కానింగ్‌కు వచ్చే గర్భిణుల వివరాలను నిబంధనల ప్రకారం నమోదు చేస్తున్నారా లేదా అనే అంశాలను పరిశీలిం చారు. ఈ సందర్భంగా డాక్టర్ గంగాధర్ మాట్లాడు తూ గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చేయడం, చేయించడం, లింగాన్ని వెల్లడించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. పీసీపీఎన్‌డీటీ చట్ట నిబంధనలను ప్రతి స్కానింగ్ కేంద్రం తప్పనిస రిగా పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తిస్తే సంబంధిత కేంద్రాల నిర్వాహకులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. ప్రతి స్కానింగ్‌కు సంబంధించిన ఫారం-ఎఫ్ వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలని, రికార్డులు, రిజిస్టర్లను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని నిర్వాహ కులకు సూచించారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతం గా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారా యణ పాల్గొన్నారు.

వైసిపి లో చేరిన 20 టిడిపి కుటుంబాలు



బుట్టాయగూడెం నవంబర్ 10:-(ప్రజాజ్యోతి):- మండలంలోని కండ్రికగూడెం గ్రామానికి చెందిన 20 కుటుబాలు తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లో చేరినట్లు పోలవరం మాజీ శాసనసభ్యులు తెల్లం బాలరాజు వెల్లడించారు. బుట్టాయగూడెంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం తెల్లం బాలరాజు కండ్రికగూడెం కు చెందిన కుటుంబాలను సాదరంగా ఆహ్వానించి,పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంపై నమ్మకంతో, ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్న వైఎస్సార్‌సిపి విధానాలకు ఆకర్షితులై పెద్ద సంఖ్యలో కుటుంబాలు పార్టీలో చేరడం శు భపరిణామమని అన్నారు.పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం,గుర్తింపు ఉంటాయని, అందరినీ కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ రత్నాజీ,సయ్యద్ బాజీ ,స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వినయ్ హత్య కేసు దర్యాప్తుపై జిల్లా ఎస్పీ ఆరా..

నేర స్థలాన్ని పరిశీలించి అధికారులకు కీలక ఆదేశాలు



ప్రజా జ్యోతి నందికొట్కూరు నందికొట్కూరు పోలీస్ స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ.. అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని సూచన నందికొట్కూరు: పట్టణంలోని షికారి పేటలో చోటుచేసుకున్న వినయ్ హత్య ఘటనపై నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ప్రత్యేక దృష్టి సారించారు. హత్య కేసు దర్యాప్తు పురోగతిని స్వయంగా తెలుసుకునేందుకు నందికొట్కూరు పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేయడంతో పాటు, ఘటన జరిగిన నేర స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ముందుగా పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ పెండింగ్ కేసులు, నమోదైన కేసుల వివరాలు, దర్యాప్తు పురోగతి, పోలీస్ రికార్డుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో విధుల నిర్వహణ, కేసుల పరిష్కారంలో అధికారులు అనుసరిస్తున్న విధానాలపై ఆరా తీశారు.అనంతరం షికారి పేటలో వినయ్ హత్యకు గురైన ప్రాంతానికి చేరుకున్న ఎస్పీ ఘటన జరిగిన ప్రదేశాన్ని నిశితంగా పరిశీలించారు. కేసు దర్యాప్తు అధికారిగా వ్యవహరిస్తున్న ఇన్‌స్పెక్టర్ మురళీధర్ రెడ్డి నుంచి హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు, ఇప్పటివరకు సేకరించిన ఆధారాలు, దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన అంశాలు, తదుపరి తీసుకుంటున్న చర్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఘటనకు సంబంధించిన వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు స్థానిక ప్రజలతో కూడా మాట్లాడి సమాచారం సేకరించారు. హత్యకు దారితీసిన పరిస్థితులు, ఘటనకు సంబంధించిన ఇతర అంశాలపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ హత్య కేసు దర్యాప్తును అన్ని కోణాల్లో లోతుగా కొనసాగించాలని అధికారులకు సూచించారు. అందుబాటులో ఉన్న ప్రతి ఆధారాన్ని శాస్త్రీయంగా విశ్లేషిస్తూ, ఎలాంటి పక్షపాతానికి తావులేకుండా సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించారు. నేరానికి పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెట్టేలా దర్యాప్తులో ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్పష్టం చేశారు.నేర నియంత్రణతో పాటు ప్రజలకు భద్రత, భరోసా కల్పించడమే లక్ష్యంగా పోలీస్ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణకు క్షేత్రస్థాయి పర్యటనలు, ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తామని పోలీస్ శాఖ స్పష్టం చేసింది.ఈ తనిఖీలో జిల్లా ఎస్పీతో పాటు ఇన్‌స్పెక్టర్లు మురళీధర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వైస్ చైర్మన్ పదవిపై కన్ను..
టీడీపీకి గుడ్‌బై చెప్పి వైసీపీ వైపు అడుగులా?

మాండ్ర శివానందరెడ్డి ముఖ్య అనుచరుడి పార్టీ మార్పుపై పట్టణంలో హాట్ టాపిక్.. కీలక పదవే లక్ష్యంగా రాజకీయ వ్యూహమా?



ప్రజా జ్యోతి నందికొట్కూరు నందికొట్కూరు పట్టణ రాజకీయాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి చుట్టూ రాజకీయ చర్చలు ఆసక్తికరంగా మారుతున్నాయి. మున్సిపాలిటీలో కీలకమైన వైస్ చైర్మన్ పదవిని దక్కించుకోవాలనే ఆశతో ఓ సీనియర్ నాయకుడు రాజకీయంగా కొత్త దారులు వెతుకుతున్నారనే ప్రచారం పట్టణంలో జోరుగా వినిపిస్తోంది. తెలుగుదేశం పార్టీలో సీనియర్ నాయకుడు మాండ్ర శివానందరెడ్డికి అత్యంత సన్నిహితుడిగా, ముఖ్య అనుచరుడిగా గుర్తింపు పొందిన సదరు నాయకుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపు అడుగులు వేయనున్నారనే ఊహాగానాలు స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.ఇటీవల మున్సిపల్ ఎన్నికల అనంతరం పట్టణంలో రాజకీయ సమీకరణాలు మారుతున్న నేపథ్యంలో వైస్ చైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందనే అంశం ప్రాధాన్యత సంతరించుకుంది. మున్సిపాలిటీలో రెండో అత్యంత కీలకమైన పదవిగా భావించే వైస్ చైర్మన్ స్థానాన్ని దక్కించుకోవడానికి వివిధ రాజకీయ వర్గాలు తమతమ ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో టీడీపీలో ఆశించిన రాజకీయ ప్రాధాన్యత, పదవి విషయంలో సదరు నాయకుడికి నిరాశ ఎదురైందని, అందుకే ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక వైపు చూస్తున్నారనే చర్చ వినిపిస్తోంది.

పదవి కోసం పార్టీ మార్పు ఆలోచనా?

టీడీపీలో కొనసాగితే మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి దక్కుతుందా లేదా అనే సందిగ్ధత నెలకొనడంతోనే ఆయన రాజకీయ భవిష్యత్తుపై పునరాలోచన చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. మరోవైపు వైసీపీ నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నారనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ పరిణామాలపై అధికారికంగా ఎలాంటి ధ్రువీకరణ లేదు.


మాండ్ర శివానందరెడ్డి వర్గంలో చర్చ!

మాండ్ర శివానందరెడ్డికి అత్యంత సన్నిహితుడిగా రాజకీయంగా గుర్తింపు పొందిన నాయకుడు పార్టీ మారితే నందికొట్కూరు పట్టణ రాజకీయాల్లో ఎలాంటి ప్రభావం ఉంటుందన్న చర్చ మొదలైంది. ఇన్నాళ్లూ టీడీపీ కార్యక్రమాల్లో చురుగ్గా వ్యవహరించిన నాయకుడు పార్టీని వీడతారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

వైస్ చైర్మన్ పదవి కోసం కొత్త రాజకీయ సమీకరణాలా?

మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి కేవలం హోదాకే పరిమితం కాకుండా పట్టణ అభివృద్ధి కార్యక్రమాలు, పరిపాలనా వ్యవహారాలు, రాజకీయ ప్రాధాన్యత పరంగా కీలకంగా ఉండటంతో ఈ పదవిపై ఆశలు పెట్టుకున్న నాయకులు తమ రాజకీయ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అడుగులు వేస్తున్నట్లు చర్చ జరుగుతోంది. మొత్తానికి నందికొట్కూరు మున్సిపాలిటీలో వైస్ చైర్మన్ పదవి చుట్టూ సాగుతున్న రాజకీయ పరిణామాలు రానున్న రోజుల్లో మరింత ఆసక్తికరంగా మారే అవకాశం ఉంది. సదరు నాయకుడు నిజంగానే టీడీపీని వీడి వైసీపీలో చేరుతారా? వైస్ చైర్మన్ పదవిపై ఆయనకు ఎలాంటి హామీ లభించింది? లేక ఇవన్నీ రాజకీయ వర్గాల్లో సాగుతున్న ప్రచారాలేనా? అన్నది అధికారిక ప్రకటన వెలువడితేనే స్పష్టత రానుంది.

నీ ఓటే నీ గ్రామ భవిష్యత్తు - ఆలోచించి సమర్థుడైన సర్పంచ్ ను ఎన్నుకోండి



తాళ్లపూడి, నవంబర్ 10, ప్రజాజ్యోతి న్యూస్ త్వరలో పంచాయతీ ఎన్నికలు రాబోతున్నాయి. గ్రామ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలు ఇవే. ఎమ్మెల్యే, ఎంపీ ఎవరైనా కావచ్చు కానీ మన మన కష్టసుఖాలు తెలిసిన వ్యక్తి సర్పంచ్ మాత్రమే. అందుకే ఈసారి ఓటు వేసే ముందు ప్రతి ఒక్కరూ ఆలోచించాలి.గ్రామానికి కావలసింది డబ్బులు పంచే నాయకుడు కాదు, గ్రామం కోసం డబ్బులు తెచ్చే నాయకుడు. కులం చూసి, బంధుత్వం చూసి, మందు, డబ్బుకు ఆశపడి ఓటు వేస్తే ఐదేళ్లు గ్రామం నష్టపోతుంది. మనం చేసే ఒక్క తప్పు నిర్ణయం వల్ల రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు, పారిశుధ్యం అన్నీ ఆగిపోతాయి.అందుకే ప్రజలకు మా విన్నపం ఇదే. సర్పంచ్ గా ఎవరిని ఎన్నుకోవాలి అంటే ఫోన్ చేస్తే పలికేవాడు, ఇంటికి వస్తే కూర్చోబెట్టి మాట్లాడేవాడు, సమస్య ఉంటే అధికారుల దగ్గరకు తీసుకెళ్లేవాడు కావాలి. పంచాయతీకి వచ్చే ప్రతి రూపాయి గ్రామానికే ఖర్చు చేసేవాడు కావాలి. కమీషన్ల కోసం, సొంత లాభం కోసం పదవిని వాడుకునే వాడు వద్దు. మన గ్రామానికి ఏం కావాలి ఏ పథకం తీసుకొస్తే యువతకు ఉపాధి వస్తుంది, రైతుకు లాభం వస్తుంది అని ఆలోచించేవాడు కావాలి. నా వాళ్లు, పరాయి వాళ్లు అని కాకుండా అన్ని కులాలను, అన్ని వర్గాలను ఒకే కుటుంబంగా చూసేవాడు కావాలి.గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను సక్రమంగా వాడుకుని గ్రామాన్ని మోడల్ గ్రామంగా మార్చగల సమర్థుడినే ఎన్నుకుందాం.ఈసారి మన ఓటు డబ్బుకో కులానికో కాదు గ్రామ అభివృద్ధికే మంచి సర్పంచ్ ను ఎన్నుకుందాం మన గ్రామాన్ని మనమే బాగు చేసుకుందాం

ప్యాపిలి: అయ్యప్ప మాలలు స్వీకరణ



(ప్రజా జ్యోతి న్యూస్) ప్యాపిలి: నవంబర్ 10 కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా ప్యాపిలి పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో భక్తులు మాలలు స్వీకరించారు. తెల్లవారుజామునే ఆలయానికి చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గురుస్వామి చేత మాలలు వేయించుకున్నారు. నియమ నిష్ఠలతో ఉంటూ ప్రతిరోజూ ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకొని, అయ్యప్ప మాల దీక్షతో ఉంటే స్వామివారి అనుగ్రహంతో భక్తుల మనోభీష్టాలు నెరవేరుతాయని విశ్వసిస్తున్నారు.

జీవన ఎరువులు, జీవ
శిలీంధ్రనాశకాలతో భూఆరోగ్య పరిరక్షణ





కె.వి.కె. ఉటుకూరు మార్గదర్శకత్వంలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన

చింతకొమ్మదిన్నె, నవంబరు 10 (ప్రజాజ్యోతి):కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామంలో జీవన ఎరువులు, జీవ శిలీంధ్రనాశకాల వినియోగంతో భూఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడంపై రైతులకు అవగాహన కల్పించారు. ఎస్.ఎం.జి.ఆర్. వ్యవసాయ కళాశాల, ఉదయగిరికి చెందిన చివరి సంవత్సరం బి.ఎస్సీ వ్యవసాయ విద్యార్థులు, కృషి విజ్ఞాన కేంద్రం (కె.వి.కె.) ఉటుకూరు మార్గదర్శకత్వంలో గ్రామీణ వ్యవసాయ అవగాహన, క్షేత్ర అనుభవ కార్యక్రమంలో భాగంగా రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లె, తొలగంగనపల్లె గ్రామాలకు చెందిన సుమారు 50 మంది రైతులు, మహిళా రైతులు, గ్రామ ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్.ఎం.జి.ఆర్. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ టి. గోపీకృష్ణ మాట్లాడుతూ, గ్రామీణ వ్యవసాయ అవగాహన, క్షేత్ర అనుభవ కార్యక్రమాన్ని ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 1979లో దేశంలోనే తొలిసారిగా ప్రవేశపెట్టిందని తెలిపారు. వ్యవసాయ విద్యార్థులకు గ్రామీణ ప్రాంతాల్లో, రైతుల పొలాల్లో ప్రత్యక్ష అనుభవం కల్పించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సాగు సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పరిశోధనా సంస్థలు, కృషి విజ్ఞాన కేంద్రాల్లో అభివృద్ధి చేసిన నూతన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరవేయడంలో విద్యార్థులు వారధులుగా పనిచేయాలన్నారు.కె.వి.కె. ఉటుకూరు సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ కె. సునీల్ కుమార్ మాట్లాడుతూ, రసాయన ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగాన్ని తగ్గించి భూసారం, భూఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అజోటోబాక్టర్, రైజోబియం, భాస్వరం కరిగించే సూక్ష్మజీవులు, పొటాషియం అందుబాటులోకి తెచ్చే సూక్ష్మజీవుల వంటి జీవన ఎరువుల వినియోగంతో మొక్కలకు అవసరమైన పోషకాలు అందుతాయని వివరించారు. ట్రైకోడెర్మా, సూడోమోనాస్ వంటి జీవ శిలీంధ్రనాశకాలతో నేల ద్వారా వ్యాపించే శిలీంధ్ర తెగుళ్లను నియంత్రించవచ్చన్నారు. సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, పంట మార్పిడి పద్ధతులను పాటించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గి స్థిరమైన వ్యవసాయం సాధ్యమవుతుందని తెలిపారు. పసుపు, బంతి, అరటి పంటల్లో ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణ పద్ధతులను వివరించారు. వ్యవసాయ కళాశాల ఉదయగిరి సెద్య విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పి. మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, అరటి, ఇతర ఉద్యాన పంటల్లో కలుపు నివారణ ప్రాముఖ్యతను వివరించారు. కలుపు మందుల ఎంపిక, సరైన మోతాదు, పిచికారీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. డ్రోన్ల ద్వారా మందులు పిచికారీ చేసేటప్పుడు గాలి దిశను గమనించాలని, వ్యక్తిగత రక్షణ పరికరాలు ధరించాలని సూచించారు.కె.వి.కె. ఉటుకూరు విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ టి. మహేష్ బాబు మాట్లాడుతూ, గ్రామీణ వ్యవసాయ అవగాహన కార్యక్రమం ద్వారా విద్యార్థులకు రైతుల సాగు పద్ధతులు, సమస్యలు, సామాజిక, ఆర్థిక పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం లభిస్తుందన్నారు. ఇందులో భాగంగా ఆరుగురు విద్యార్థులను తొలగంగనపల్లెకు, మరో ఆరుగురిని నాగిరెడ్డిపల్లెకు కేటాయించినట్లు తెలిపారు. ఉద్యానశాఖకు చెందిన డాక్టర్ రెడ్డయ్య మాట్లాడుతూ, ఉద్యాన పంటల్లో కోత అనంతర యాజమాన్య పద్ధతుల ప్రాముఖ్యతను వివరించారు. పండ్లు, కూరగాయల నాణ్యతను కాపాడేందుకు సరైన కోత సమయం, వర్గీకరణ, ప్యాకింగ్, నిల్వ, రవాణా పద్ధతులను పాటించాలని సూచించారు.పశువైద్యులు డాక్టర్ శివరామిరెడ్డి మాట్లాడుతూ, పశువులు, కోళ్లలో వచ్చే వ్యాధులు, వాటి లక్షణాలు, నివారణ చర్యలు, టీకాల ప్రాముఖ్యతను వివరించారు. పశువులకు పరిశుభ్రమైన వాతావరణం, సరైన పోషకాహారం, సకాలంలో వైద్య సేవలు అందించాలని సూచించారు. కె.వి.కె. ఉటుకూరు పశుసంవర్ధక శాస్త్రవేత్త డాక్టర్ ఐ. సురేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, పశువుల పోషణలో పచ్చిమేత, ఎండుమేత ప్రాముఖ్యతను వివరించారు. సమతుల్య పోషకాహారం అందించడం ద్వారా పాల ఉత్పత్తి, పశువుల ఆరోగ్యాన్ని మెరుగుపరచవచ్చన్నారు.కె.వి.కె. ఉటుకూరు ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. మానస మాట్లాడుతూ, అరటి గెలల నాణ్యత, కాయల పరిమాణం, బరువు పెంచేందుకు పిలకల నియంత్రణ, ఎండిన ఆకుల తొలగింపు, గెలలకు రక్షణ కల్పించడం, సరైన పోషక యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. ఎస్.ఎం.జి.ఆర్. వ్యవసాయ కళాశాల కీటక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం. కిషన్ తేజ్ మాట్లాడుతూ, రైతుల పొలాలను సందర్శించడం, పంటల స్థితిగతులను పరిశీలించడం, రైతులతో ముఖాముఖి చర్చించడం ద్వారా విద్యార్థులకు వ్యవసాయ సమస్యలపై ప్రత్యక్ష అవగాహన లభిస్తుందని తెలిపారు. ఈ అనుభవం వారి భవిష్యత్తు వృత్తి జీవితానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా చివరి సంవత్సరం వ్యవసాయ విద్యార్థులు వివిధ వ్యవసాయ, ఉద్యాన పంటల సాగు పద్ధతులు, జీవన ఎరువులు, జీవ శిలీంధ్రనాశకాల వినియోగం, భూఆరోగ్య పరిరక్షణ, సమగ్ర సస్యరక్షణ, పశుపోషణ అంశాలపై ప్రదర్శన ఏర్పాటు చేశారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై వివరించి, వారి సందేహాలను నివృత్తి చేశారు.ఈకార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, రైతులు, మహిళా రైతులు, గ్రామ ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

ఏసీబీ అధికారుల చేతిలో చిక్కిన.... అవినీతి ముద్దు బిడ్డ రెవెన్యూ అధికారి...!!!



జి.కొండూరు :(సెప్టెంబర్ 10,,ప్రజా జ్యోతి బ్యూరో): ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండల రెవెన్యూ కార్యాలయంలో.... మంగళవారం విజయవాడ ఏసీబీ అధికారులు...లంచం అడిగిన అవినీతి అధికారిని పట్టుకున్నారు. వివరాలు ప్రకారం విజయవాడ ప్రాంతానికి చెందిన రైతు చిన్ని నైజారిని రావు పట్టాదారు పాస్ పుస్తకం కావాలని రెవెన్యూ అధికారులకు అర్జీ పెట్టుకోగా,చివరకు రెవిన్యూ డిటి అధికారి 10వేల రూపాయలు నజరానా చెల్లిస్తేనే... పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తా అని చెప్పడంతో... విధిలేక ఆర్థిక స్తోమత లేక,రైతు చిన్ని నైజారినిరావు విజయవాడ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగింది. రైతు ఫిర్యాదుతో విజయవాడ ఏసీబీ అధికారులు అడిషనల్ ఎస్పీ స్రవంతి రాయి, డీఎస్పీ డివి. సుబ్బారావు, సీఐ నాగరాజు మరియు ఏసీబీ సిబ్బందితో,రెవెన్యూ అధికారి డిటి అధికారి విజయ్ కుమార్ రైతు వద్ద 10వేలు లంచం తీసుకుంటూ వుండగా...రెడ్ హ్యాండ్ గా ఏసిపి అధికారులు పట్టుకున్నారు. ఈ మధ్యకాలంలో రెవెన్యూ అధికారులే కాక పలు ప్రభుత్వ అధికారులు లంచంగా డబ్బులు ఇస్తేనే... డాక్యుమెంట్ ఫైల్స్ ను కదుపుతున్నారని లంచం ఇస్తేనే పనులు చేస్తున్నారని ఏసీబీ అధికారులు లంచగొండి అధికారులను డిటి విజయ్ కుమార్ అధికారిని పట్టుకున్నట్టుగా... మిగతా లంచగొండి అధికారులను కూడా పట్టుకోవాలని పలువురు రైతులు,స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

400 కోట్ల క్లబ్ లో రామాయణం

హైదరాబాద్ : మైథలాజికల్ ఎపిక్ 'రామాయణ' బాక్సాఫీస్ వద్ద పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్తోంది. నవంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా మూడు రోజుల్లోనే రికార్డు స్థాయిలో కలెక్షన్స్ సాధించింది. మరి ఆ వివరాలు ఓసారి చూస్తే...వరల్డ్ వైడ్‌గా తొలి మూడు రోజుల్లో రూ.375.50 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. ఇండియావ్యాప్తంగా రూ.218.25 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ సాధించగా... రూ.182.70 కోట్ల నెట్ కలెక్ట్ చేసినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. శనివారం ఒక్క రోజే ఇండియావ్యాప్తంగా రూ.69.80 కోట్ల నెట్ కలెక్షన్స్ సాధించింది. ఓవర్సీస్ చూస్తే దాదాపు రూ.157.25 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ సాధించినట్లు తెలుస్తోంది. దీపావళి ఫెస్టివల్ ఆదివారం కావడంతో వీకెండ్ నెంబర్స్ మరింత పెరగొచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

వరల్డ్ వైడ్ మూడు రోజుల కలెక్షన్స్ – రూ.375.50 కోట్ల గ్రాస్

ఇండియా గ్రాస్ కలెక్షన్స్ – రూ.218.25 కోట్లు

ఇండియా నెట్ కలెక్షన్స్ – రూ.182.70 కోట్లు

ఓవర్సీస్ గ్రాస్ కలెక్షన్స్ – రూ.157.25 కోట్లుఈ మూవీకి నితీశ్ తివారీ దర్శకత్వం వహించగా... శ్రీరాముడిగా రణబీర్, సీతగా సాయిపల్లవి, లక్ష్మణుడిగా రవి దూబే, రావణుడిగా యశ్, మండోదరిగా కాజల్ అగర్వాల్, భరతుడిగా ఆదినాథ్ కొఠారే, శతృఘ్నుడిగా నితీశ్ శర్మ, శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్ నటించారు. దాదాపు రూ. 4 వేల కోట్ల బడ్జెట్‌తో నమిత్ మల్హోత్రా, కన్నడ స్టార్ యశ్ సంయుక్తంగా నిర్మించారు. 2028లో రెండో పార్ట్ రిలీజ్ కానుంది.రామాయణం కథలో డైరెక్టర్ నితీశ్ తివారీ సరికొత్త కోణాన్ని చూపించారు. రావణుడి పరిచయంతో ప్రారంభమైన స్టోరీ... లంకలో అసుర సామ్రాజ్యాన్ని అంతం చేసేందుకు ఇంద్రుడు (కునాల్ కపూర్) తన దేవతల సమూహారంతో భీకర యుద్ధం చేసి నగరాన్ని సొంతం చేసుకుని ఆ బాధ్యతను కుబేరునికి అప్పగిస్తాడు. ఈ ఓటమి తర్వాత కైకసి (శోభన) అవమాన భారంతో పెద్ద కొడుకు దశానన (యష్) దగ్గరకు వెళ్తుంది. దీంతో ఘోర తపస్సు చేసిన బ్రహ్మ నుంచి వరాలు పొందిన దశానన... రావణుడిగా తిరిగి వచ్చి లంకా నగరాన్ని హస్తగతం చేసుకుంటాడు. ముల్లోకాలకు అధిపతిగా అవతరిస్తాడు. రావణుడి పాలనలో యజ్ఞ యాగాదులు ఆటంకం కలుగుతుంది. దీంతో దేవతలు నిస్తేజితులవుతారు. సృష్టి వినాశనం అవుతుందని బ్రహ్మ దగ్గరకు వెళ్తాడు దేవేంద్రుడు (కునాల్ కపూర్). అప్పుడు మానవుడిగా అవతారం దాలుస్తారు బ్రహ్మ. అయోధ్యలో దశరథుని ఇంట రాముడు (రణబీర్ కపూర్) జన్మిస్తారు.

బైకులకు నిప్పు అంటించిన ఆకతాయిలు

హైదరాబాద్ : ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిరి నగర్ కాలనీలో అర్ధరాత్రి వేళ ఆకతాయిలు సృష్టించిన భయాందోళన స్థానికులను తీవ్రగ్రాంథికి గురిచేసింది. ఇళ్ల ముందు నిలిపి ఉంచిన రెండు ద్విచక్ర వాహనాలకు దుండగులు కావాలనే నిప్పు పెట్టి పరారయ్యారు.సిరి నగర్ కాలనీలో అర్ధరాత్రి దాటిన తర్వాత నివాసాల ముందు పార్క్ చేసి ఉన్న రెండు బైక్‌లపై దుండగులు నిప్పు రాజేశారు. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గమనించిన స్థానికులు ఆర్పివేసే ప్రయత్నం చేసినప్పటికీ, ఒక బైక్ పూర్తిగా కాలి బూడిదవ్వగా, మరొక బైక్ పాక్షికంగా దగ్ధమైంది.ఈ ఘాతకానికి పాల్పడిన దుండగులు బైక్స్ను నిప్పు పెట్టి అక్కడ నుంచి పరారవుతున్న దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాల్లో స్పష్టంగా రికార్డయ్యాయి. గతంలో కూడా ఇదే కాలనీలో సరిగ్గా ఇదే తరహాలో రెండు కార్లకు దుండగులు నిప్పు పెట్టిన ఘటనలు జరిగినట్లు కాలనీవాసులు వాపోతున్నారు.

హైదరాబాద్ వాసుల తాగునీటి కష్టాలకు చెక్?



హైదరాబాద్ : ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో సింగూరు మంజీరా జలవనరుల్లో నీటి లభ్యత తగ్గుతున్న దృష్ట్యా హైదరాబాద్ నగరానికి తాగునీటి సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా జలమండలి ముందస్తు చర్యలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా రోజుకు 40 మిలియన్ గ్యాలన్ల (ఎంజీడీ) గోదావరి అదనపు జలాలను నగరానికి తరలించేందుకు ఘన్ పూర్ వద్ద చేపడుతున్న పైప్‌లైన్ అనుసంధాన పనులను జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నవంబర్ 15వ తేదీలోగా పైప్‌లైన్ అనుసంధాన పనులు పూర్తి చేసి, గోదావరి జలాలను సరఫరా చేసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నిర్దేశించిన గడువును ఒక్కరోజు కూడా పొడిగించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు.పైప్‌లైన్ నిర్మాణ పనులను రెండు వైపుల నుంచి సమాంతరంగా చేపట్టి, నిర్ణీత గడువులోగా అనుసంధానం చేయాలని ఎండీ ఆదేశించారు. ఏ నిర్మాణ సంస్థ ఎంత దూరం పైప్‌లైన్ ఏర్పాటు చేసిందనేది ముఖ్యం కాదని, పనులు పూర్తయి పైప్‌లైన్ అనుసంధానం కావడమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పనుల పరిధికి సంబంధించిన బిల్లుల సర్దుబాటును తర్వాత పరిశీలించవచ్చని, ప్రస్తుతం పనుల పూర్తికే అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.పైప్‌లైన్ అనుసంధాన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు రోజుకు ఎనిమిది గంటల చొప్పున మూడు షిఫ్టుల్లో ప్రత్యేక కార్మిక బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి షిఫ్టుకు వేర్వేరు బృందాలను నియమించి, పగలు రాత్రి తేడా లేకుండా నిరంతరాయంగా పనులు కొనసాగించాలన్నారు. రాత్రివేళ పనులకు అవసరమైన ఫ్లడ్‌లైట్లు, యంత్ర సామగ్రి, ఇతర సౌకర్యాలను సమకూర్చుకోవాలని సూచించారు.పైప్‌లైన్ అనుసంధానానికి కీలకమైన రోడ్డు క్రాసింగ్ పనులను అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని ఎండీ ఆదేశించారు. అవసరమైన అనుమతులు, భద్రతా ఏర్పాట్లతో రాత్రి నుంచే రోడ్డు కటింగ్ పనులు ప్రారంభించి, రెండు మూడు రోజుల్లో పైపుల ఏర్పాటుకు మార్గం సుగమం చేయాలని సూచించారు. ఇందుకోసం అదనంగా రెండు మూడు ప్రత్యేక కార్మిక బృందాలను రంగంలోకి దించాలని ఆదేశించారు.గోదావరి జలాల తరలింపునకు చేపడుతున్న పనులను వేగవంతం చేసేందుకు మిషన్ భగీరథ, అటవీశాఖల అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. పైప్‌లైన్ అనుసంధానానికి అవసరమైన సాంకేతిక సహకారం, యంత్రాలు, మానవ వనరులను ఆయా శాఖల సహకారంతో సమకూర్చుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం కొనసాగుతున్న గోదావరి ప్రాజెక్టు పనుల్లో నిమగ్నమైన సాంకేతిక నిపుణులు, కార్మిక బృందాలు, ఎక్స్‌కవేటర్లు, డ్రిల్లింగ్ యంత్రాలు, ఇతర భారీ యంత్ర సామగ్రిని అవసరమైన మేరకు ఈ పనులకు మళ్లించాలని సూచించారు. అవసరమైతే ఇతర ప్రాంతాల్లో కొనసాగుతున్న పనులను తాత్కాలికంగా నిలిపివేసి, అక్కడి యంత్రాలు, వాహనాలు, సిబ్బందిని ఈ ప్రాజెక్టుకు వినియోగించుకోవాలన్నారు.రాబోయే వేసవి కాలంలో తాగునీటి అవసరాలు పెరిగే అవకాశం ఉన్నందున అందుబాటులో ఉన్న జలవనరులను సమర్థంగా వినియోగించుకోవాలని ఎండీ సూచించారు. ముఖ్యంగా సింగూరు?మంజీరా జలవనరులపై ఆధారపడిన ప్రాంతాలకు ప్రత్యామ్నాయంగా గోదావరి జలాలను అందించే ఏర్పాట్లకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పైప్‌లైన్ అనుసంధాన పనుల పురోగతిని ప్రతిరోజూ పర్యవేక్షించాలని, ఎదురయ్యే సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు సకాలంలో పూర్తికావడం జలమండలి ప్రతిష్ఠకు సంబంధించిన అంశమని, అధికారులు, నిర్మాణ సంస్థలు పూర్తి బాధ్యతతో పనిచేయాలని స్పష్టం చేశారు.నవంబర్ 15వ తేదీలోగా పైప్‌లైన్ అనుసంధాన పనులు పూర్తి చేసి, రోజుకు 40 ఎంజీడీల గోదావరి అదనపు జలాల సరఫరాకు మార్గం సుగమం చేయాలని ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు

హైదరాబాద్‌లో టపాసుల వివాదం..

కత్తులతో దాడి.. ముగ్గురిపై హత్యాయత్నం

రోడ్డుపై వెళ్తున్న చిన్నారిపై టపాసు విసరడంతో వివాదం..

ప్రశ్నించిన మేనమామతో వాగ్వాదం.. ముగ్గురిపై కత్తులతో దాడి

హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలోని పటేల్‌నగర్, గాంధీభవన్ ప్రాంతంలో టపాసులు పేల్చే విషయంలో తలెత్తిన వివాదం తీవ్ర ఘర్షణకు దారితీసింది. చిన్నారిపై టపాసు విసరడాన్ని ప్రశ్నించినందుకు ముగ్గురు వ్యక్తులపై కత్తులతో దాడి జరిగిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ దాడిలో షేక్ వహీద్, షేక్ ఇమ్రాన్, షేక్ షాబాజ్ గాయపడ్డారు. చిన్నారిపై టపాసు విసరడంతో మొదలైన గొడవ : అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం.. పటేల్‌నగర్, గాంధీభవన్ ప్రాంతంలో రోడ్డుపై వెళ్తున్న ఓ చిన్నారిపై కొందరు వ్యక్తులు టపాసు విసిరినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని గమనించిన చిన్నారి మేనమామ వారిని ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మాటామాటా పెరగడంతో వివాదం తీవ్రరూపం దాల్చింది. సల్మాన్, అర్బాజ్‌తో పాటు మరికొందరు కత్తులతో దాడి : చిన్నారిపై టపాసు విసిరిన విషయాన్ని ప్రశ్నించడంతో మొదలైన గొడవలో సల్మాన్, అర్బాజ్‌తో పాటు మరికొందరు వ్యక్తులు ముగ్గురిపై కత్తులతో దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ దాడిలో షేక్ వహీద్, షేక్ ఇమ్రాన్, షేక్ షాబాజ్ తీవ్రంగా గాయపడ్డారు. దాడి అనంతరం స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు వారికి చికిత్స అందిస్తున్నారు. బేగంబజార్ పోలీసుల దర్యాప్తు : ఘటనపై సమాచారం అందుకున్న బేగంబజార్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘర్షణకు అసలు కారణాలు ఏమిటి? దాడిలో ఎవరెవరు పాల్గొన్నారు? అనే కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకునే దిశగా దర్యాప్తు కొనసాగుతోంది. చిన్నారుల భద్రతను విస్మరించొద్దు.. వివాదాలతో ప్రాణాలు తీసుకోవద్దు! పండుగల సమయంలో టపాసులు కాల్చేటప్పుడు చిన్నారుల భద్రత పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా టపాసులు విసరడం ప్రమాదకరం. ఎవరైనా తప్పు చేస్తే చట్టపరంగా ప్రశ్నించాలి తప్ప, కత్తులతో దాడులకు దిగడం ఏమాత్రం సమర్థనీయం కాదు. చిన్నపాటి వివాదాలు ప్రాణాపాయ పరిస్థితులకు దారితీయడం సమాజానికి ఆందోళన కలిగించే విషయం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి.

హోటల్స్‌కు మద్దతుగా ఓవైసీ



హైదరాబాద్ : భాగ్యనగరంలో ఇటీవల కాలంలో టీజీ సేఫ్ నిర్వహిస్తున్న ఆకస్మిక తనిఖీలతో హోటళ్ల యజమానులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వారికి మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ బాహాటంగా మద్దతుగా నిలిచారు. ట్విన్ సిటీస్ హోటల్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధి బృందంతో కలిసి ఆయన తెలంగాణ సేఫ్ కమిషనర్ అవినాష్ మొహంతిని కలిశారు. నగరవ్యాప్తంగా ఆహార భద్రతా అధికారులు చేపడుతున్న తనిఖీలు పారదర్శకంగా, నిష్పాక్షికంగా, చట్టబద్ధమైన నియమ నిబంధనలకు లోబడి మాత్రమే సాగాలని, వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేసే ధోరణికి స్వస్తి పలకాలని ఈ సందర్భంగా కమిషనర్‌ను ఆయన గట్టిగా కోరారు.తనిఖీల పేరిట నిబంధనలను అతిక్రమించి ఏకపక్ష చర్యలకు పాల్పడటం సరికాదని అసదుద్దీన్ నేతృత్వంలోని బృందం ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లింది. నిబంధనల ప్రకారం ఏదైనా హోటల్‌లో లోపాలు కనిపిస్తే.. వెంటనే తీవ్ర చర్యలు తీసుకోకుండా తొలుత ఇంప్రూవ్‌మెంట్ నోటీసు జారీ చేసి నిర్ణీత గడువు ఇవ్వాల్సి ఉంటుందని గుర్తుచేశారు. ఆ చట్టబద్ధమైన ప్రక్రియను దాటవేసి సోషల్ మీడియాలో విజువల్స్ విడుదల చేయడం, వ్యాపార సంస్థల ప్రతిష్టను మసకబార్చడం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆహార సంస్కృతి, గుర్తింపును పరిరక్షించడంలో హోటల్ రంగం కీలక పాత్ర పోషిస్తోందని అసదుద్దీన్ వర్గం పేర్కొంది. వేలాది మంది కార్మికులు, చిరువ్యాపారుల జీవనోపాధి ఈ రంగంపై ఆధారపడి ఉన్న వేళ.. కేవలం చిన్నపాటి లోపాలను సైతం భూతద్దంలో చూపిస్తూ హోటళ్లను సీజ్ చేయడం లేదా లైసెన్సులు రద్దు చేయడం వల్ల స్థానిక ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆహార నాణ్యతను కాపాడటానికి తాము వ్యతిరేకం కాదని, అయితే అధికారుల వైఖరి పారదర్శకంగా, సమానంగా ఉండాలే తప్ప.. ఎంపిక చేసుకున్న కొన్ని సంస్థలనే లక్ష్యంగా చేసుకుని వేధించేలా ఉండకూడదని వ్యాపారులు వాపోయారు.పౌరుల ఆరోగ్య పరిరక్షణ ఎంత ముఖ్యమో, వ్యాపారాలు గౌరవప్రదంగా సాగే వాతావరణం కల్పించడం కూడా అంతే ఆవశ్యకమని అసదుద్దీన్ అంటున్నారు. హోటల్ నిర్వాహకులకు సరైన మార్గదర్శకాలు ఇచ్చి, వారిలో అవగాహన పెంచేలా అధికారులు సహకారాత్మక ధోరణితో వ్యవహరించాలని కోరారు

రూ.66కే బియ్యం



నిజామాబాద్ : బియ్యం ధరలపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బియ్యం ధరలకు గరిష్ఠ పరిమితులు విధించింది. కొంతమంది ఎక్కువ ధరలకు బియ్యంను విక్రయిస్తున్న క్రమంలో దానికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా బియ్యం ధరలను ఫిక్స్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం నిర్ణయించిన ధరలులోపే బియ్యం విక్రయించాలి. అంతకంటే అధిక ధరలకు విక్రయిస్తే ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. బియ్యం రకాలను బట్టి గరిష్ఠ ధరలను ఫిక్స్ చేసింది. అలాగే బియ్యం బస్తాలపై గరిష్ఠ చిల్లర ధరలను కూడా ముద్రించాల్సిందేనని ఆదేశించింది. అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్టులు నమోదు చేస్తామని హెచ్చరికలు జారీ చేసింది. బియ్యం ధరల్లో మోసాలకు పాల్పడితే సహించేది లేదంటూ హెచ్చరించింది.బీపీటీ, కేఎన్ఎం రకం బియ్యంకు సంబంధించి కిలో గరిష్ఠ ధర రూ.66గా ఫిక్స్ చేసింది. ఇక ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రకం కిలో గరిష్ఠ ధర రూ.74గా పరిమితి విధించింది. అలాగే హెచ్ఎంటీ, జైశ్రీరాం రకం బియ్యం గరిష్ఠ చిల్లర ధర రూ.79గా నిర్ణయించింది. ఎల్‌నినో ప్రభావం క్రమంలో పంట దిగుబడి తగ్గడంతో బియ్యం ధరలు దేశవ్యాప్తంగా పెరిగాయి. తెలంగాణలోనూ బియ్యం ధరలు పెరగ్గా.. కొంతమంది వ్యాపారులు దీనిని అసరాగా తీసుకుని ధరలు పెంచేస్తున్నారు. కిలో రూ.100, ఆపై ధరలకు విక్రయిస్తున్నారు. పెరిగిన ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారం పడుతోంది. దీంతో బియ్యం ధరల పెరుగుదలకు కళ్లెం వేసేందుకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ రంగంలోకి దిగింది. రాష్ట్రంలో బియ్యం కొరత ఉందనే ప్రచారాన్ని ప్రభుత్వం తిప్పికొట్టింది. తగినన్ని నిల్వలు ఉన్నాయని, అందులో ఎలాంటి సమస్య లేదని పేర్కొంది.

మార్కెట్ ధరలను తారుమారు చేయడం, బియ్యంను అక్రమంగా నిల్వచేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాలశాఖ హెచ్చరించింది. నిరంతరం మిల్లర్లు, వ్యాపారులపై తనిఖీలు జరుగుతాయని, ఇది నిరంతర ప్రక్రియ అని తెలిపింది. అక్టోబర్ 29వ తేదీ నుంచి నవంబర్ 5వ తేదీ వరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్, లీగల్ మెట్రాలజీ శాఖలు సంయుక్తంగా తనిఖీలు చేపట్టాయి. రిటైల్ దుకాణాలు, టోకు వ్యాపారుల దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. పలువురిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. పదే పదే అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల్లోపు మాత్రమే బియ్యం అమ్మాలని తెలిపింది. కాగా తెలంగాణలో బియ్యం ధరలు భారీగా పెరిగాయి. బహిరంగ మార్కెట్లో కిలో రూ.100 వరకు చేరుకున్నాయి

అధికారుల నిర్లక్ష్యం..

వృథాగా పోతున్న భగీరథ నీళ్లు

మాగనూరు ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి భవిష్యత్తు అవసరాల కోసం ఆదా చేయాలని ప్రభుత్వం ఒకవైపు ప్రచారం చేస్తుంటే.. మరోవైపు ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడిచేలా మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. మాగనూరు మండల కేంద్రంలో మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ పగిలి మూడు రోజులైనా సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో విలువైన తాగునీరు వృథాగా పారుతూ చెరువును తలపిస్తోంది. పైప్‌లైన్ నుంచి బయటకు వస్తున్న నీరు పరిసర ప్రాంతాల్లో పెద్దఎత్తున నిలిచిపోవడంతో నీటి వనరులు వృథా కావడమే కాకుండా పరిసర ప్రాంతాలు చిత్తడిగా మారుతున్నాయి. ఒకవైపు మాగనూరు కృష్ణ మండల పరిధిలోని ఎనిమిది గ్రామాల ప్రజలు మిషన్ భగీరథ ద్వారా సక్రమంగా తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. మరోవైపు పైప్‌లైన్ పగిలి నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా నీరు వృథాగా పారుతున్నా అధికారులు కనీసం మరమ్మతులు చేపట్టకపోవడం వారి పనితీరుకు అద్దం పడుతోంది. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించాల నే లక్ష్యంతో మిషన్ భగీరథ పథకాన్ని అమలు చేస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యం కారణంగా పథకం లక్ష్యం నీరుగారుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మాగనూరు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ముందు జాతీయ రహదారి పక్కన ప్రజలకు తాగునీరు అందించాల్సిన పైప్‌లైన్ల నుంచే నీరు వృథాగా ప్రవహిస్తుంది. నీటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పే ప్రభుత్వ యంత్రాంగం ముందుగా తన శాఖల పరిధిలో జరుగుతున్న నీటి వృథాను అరికట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఉద్యోగ విరమణ అనంతరం

చాలా మంది చేయాల్సిన పనులు ఇవే..

ఉద్యోగ విరమణ అంటే పని జీవితానికి ముగింపు. కానీ చురుకైన జీవనానికి మాత్రం ముగింపు కాకూడదు. వయసు పెరిగే కొద్దీ శారీరకంగా ఆరోగ్యంగా ఉండడంతోపాటు మానసికంగా చురుకుగా, సామాజికంగా అందరితో కలిసిమెలిసి ఉండటం కూడా ఎంతో ముఖ్యం. కార్యాలయం నుంచి బయటకు వచ్చినంత మాత్రాన ఉత్పాదకతకు దూరం కావాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. ఆర్థికంగా పదవీ విరమణకు సిద్ధమవ్వడంతోపాటు, ఆ తర్వాతి జీవితాన్ని ఆరోగ్యంగా, ఉత్సాహంగా గడిపేందుకు కూడా ముందుగానే ప్రణాళిక వేసుకోవాలని సూచిస్తున్నారు. ఆధునిక వైద్యం, టీకాలు, యాంటీబయాటిక్స్ వల్ల మనుషుల ఆయుర్దాయం పెరిగింది. అయితే ఎక్కువకాలం జీవించడం మాత్రమే ముఖ్యం కాదు. ఆ కాలమంతా ఆరోగ్యంగా ఉండడం కూడా అవసరం. మనం ఎంతకాలం బతుకుతున్నామన్నదానితోపాటు, ఎంతకాలం ఆరోగ్యంగా జీవిస్తున్నామన్నది ముఖ్యమని వారు అభిప్రాయపడుతున్నారు.ఒక్కసారిగా మారిపోయే దినచర్య..: ఉద్యోగ విరమణ తర్వాత చాలామందికి రోజువారీ దినచర్య ఒక్కసారిగా మారిపోతుంది. కార్యాలయ వాతావరణం, సహోద్యోగులతో మాట్లాడడం, రోజువారీ పనులు తగ్గిపోతాయి. కొందరు ఎక్కువ సమయం ఇంట్లోనే టీవీ చూస్తూ లేదా ఫోన్ ఉపయోగిస్తూ గడుపుతారు. దీనివల్ల చురుకుదనం, జీవితంపై ఆసక్తి తగ్గే ప్రమాదం ఉంటుంది. పదవీ విరమణ అంటే శరీరం విశ్రాంతి తీసుకోవడం కాదని, జీవితంలో ఏదో ఒక లక్ష్యంతో ముందుకు సాగాలని సూచిస్తున్నారు. 60 ఏళ్ల తర్వాత కూడా వ్యాపారం ప్రారంభించడం, స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం, సమాజ సేవ చేయడం లేదా చాలాకాలంగా చేయాలనుకున్న అభిరుచులను కొనసాగించడం ద్వారా ఉత్సాహంగా ఉండవచ్చు. ఆలయాల్లో సేవ చేయడం, వృద్ధుల కోసం స్వయం సహాయక బృందాలు ఏర్పాటు చేయడం వంటి పనులు కూడా జీవితానికి కొత్త ప్రయోజనాన్ని ఇస్తాయి. వృద్ధుల్లో ఒంటరితనం మరో ప్రధాన సమస్య. కుటుంబ సభ్యులతో సంబంధాలు తగ్గడం, స్నేహితుల సంఖ్య తగ్గిపోవడం, కదలికల పరిమితులు వంటి కారణాలతో చాలామంది ఒంటరిగా భావిస్తారు. పట్టణ భారతదేశంలో ప్రతి నలుగురిలో ఒకరు గణనీయమైన ఒంటరితనాన్ని అనుభవిస్తున్నట్లు ఒక అధ్యయనం సూచిస్తోందని పేర్కొంటున్నారు. స్నేహితులతో మాట్లాడడం, కుటుంబ సభ్యులతో సమయం గడపడం, నడక బృందాలు, ఆటలు, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ఈ సమస్యను తగ్గించుకోవచ్చని సూచిస్తున్నారు.మెదడును చురుగ్గా ఉంచుకోవాలి..వయసు పెరిగినా మెదడును చురుకుగా ఉంచుకోవడం అవసరం. చదవడం, కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడం, ఫొటోగ్రఫీ, చదరంగం వంటి అభిరుచులను కొనసాగించడం మానసిక చురుకుదనానికి తోడ్పడతాయి. వృద్ధాప్యం సహజమే అయినప్పటికీ, శారీరక క్షీణత తప్పనిసరి కాదని చెబుతున్నారు. కండరాలను బలోపేతం చేసుకోవడం, రోజూ కదలడం, తగినంత నిద్రపోవడం, ఒత్తిడిని నియంత్రించడం ఆరోగ్యకరమైన వృద్ధాప్యానికి ముఖ్యమైన అంశాలు. వయసుతోపాటు కండరాల బలం తగ్గుతుంది కాబట్టి బరువులతో చేసే వ్యాయామాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. నడక మంచిదే అయినప్పటికీ, అదే పూర్తిస్థాయి వ్యాయామం కాదని సూచిస్తున్నారు. కండరాలను కాపాడుకోవడానికి శక్తి వ్యాయామంతోపాటు తగినంత ప్రొటీన్ తీసుకోవడం కూడా అవసరం. ఉద్యోగ విరమణను జీవితానికి ముగింపుగా కాకుండా కొత్త అవకాశాలకు ప్రారంభంగా చూడాలి. కొత్త ఆసక్తులను పెంపొందించుకోవడం, సమాజంతో సంబంధాలు కొనసాగించడం, శారీరకంగా చురుకుగా ఉండడం ద్వారా వృద్ధాప్యాన్ని ఆరోగ్యంగా, ఆనందంగా గడపవచ్చు. ఆర్థిక భద్రతతోపాటు శారీరక, మానసిక ఆరోగ్యానికి కూడా ముందుగానే ప్రణాళిక వేసుకోవడమే దీర్ఘకాలిక ఆరోగ్యానికి కీలకమని తెలియజేస్తున్నారు.

అర్హులైన ప్రతి కుటుంబానికి

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్ర నాయక్

డోర్నకల్ మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమంలో భాగంగా 3వ, 4వ, 5వ వార్డులకు చెందిన లబ్ధిదారులకు రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డోర్నకల్ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్ర నాయక్ హాజరై లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

బిజినెస్

బిలియనీర్లకు భారీ ఊరట.. పన్ను వసూలు ప్లాన్‌కు బ్రేక్!



కోట్లాది రూపాయల సంపద ఉన్నవారికి అదనపు పన్ను వేయాలా? వద్దా? ఈ ప్రశ్నకు అమెరికాలోని కాలిఫోర్నియా ప్రజలు తమ ఓటుతో సమాధానమిచ్చారు. బిలియనీర్ల సంపదపై 5 శాతం పన్ను విధించాలన్న ప్రతిపాదనను తిరస్కరించారు. దీంతో అత్యంత ధనవంతులపై పన్ను వేసి ఆరోగ్య రంగానికి నిధులు సమకూర్చాలన్న ప్రయత్నానికి బ్రేక్ పడింది. కాలిఫోర్నియాలో మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్, కిమ్ కర్దాషియాన్, ఓప్రా విన్‌ఫ్రే వంటి సుమారు 200 మంది బిలియనీర్లు ఉన్నారు. వీరిలో 110 కోట్ల డాలర్లకు (సుమారు రూ.9 వేల కోట్లకు పైగా) మించి సంపద ఉన్నవారిపై ఈ పన్ను విధించాలని 'ప్రపోజిషన్ 40' పేరుతో ప్రతిపాదన తీసుకొచ్చారు. దాంతోపాటుగా వీరి మొత్తం ఆస్తులు, షేర్ల విలువపై ఒకేసారి 5 శాతం పన్ను వసూలు చేయాలనుకున్నారు. ఈ పన్నుతో సుమారు 10,000 కోట్ల డాలర్లు సమకూరుతాయని అంచనా వేశారు. అయితే, ట్రంప్ ప్రభుత్వం తీసుకొచ్చిన పన్నులు, ఖర్చులకు సంబంధించిన కొత్త చట్టం కారణంగా కాలిఫోర్నియాలో ఆరోగ్య రంగానికి కేంద్ర నిధులు తగ్గనున్నాయి. ఈ లోటును పూడ్చడంతోపాటు వైద్య సేవలకు ఆ డబ్బును ఉపయోగించాలని ప్రతిపాదకులు భావించారు. కాని, ఈ ప్రతిపాదనకు డెమొక్రాట్లు, కార్మిక సంఘాల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. మరోవైపు, గూగుల్ సహ వ్యవస్థాపకుడు సెర్గీ బ్రిన్, కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసమ్‌లు ఈ పన్నును వ్యతిరేకించారు. పన్ను విధిస్తే బిలియనీర్లు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతారని, దీంతో రాష్ట్రానికి వచ్చే ఆదాయపు పన్ను కూడా తగ్గుతుందని గవర్నర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రతిపాదనను అడ్డుకునేందుకు సెర్గీ బ్రిన్ ఏకంగా 10 కోట్ల డాలర్లకు పైగా ఖర్చు చేసినట్లు వార్తలు వచ్చాయి. అయితే, ఈ పన్నుకు మద్దతు ఇచ్చిన కార్మిక సంఘాల నాయకుడు డేవ్ రీగన్ మరోసారి ప్రయత్నిస్తామని ప్రకటించారు. 2028లో బిలియనీర్లపై పన్ను విధించే ప్రతిపాదనను మళ్లీ తీసుకొస్తామని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉన్న కాలిఫోర్నియాలో ధనవంతులు, పేదల మధ్య భారీ ఆర్థిక వ్యత్యాసం ఉంది. అయినప్పటికీ బిలియనీర్లపై అదనపు పన్ను విధించాలన్న ప్రతిపాదనకు ఓటర్లు మద్దతు ఇవ్వకపోవడమనేది చర్చనీయాంశంగా మారింది.

సీఈఓపై దర్యాప్తు ఎఫెక్ట్.. ఒక్కరోజులో ఎన్విడియా మార్కెట్ విలువ రూ.17 లక్షల కోట్లు ఆవిరి!

ప్రపంచంలోనే అత్యంత విలువైన టెక్ కంపెనీల్లో ఒకటైన ఎన్విడియాకు ఒక్కరోజులో భారీ నష్టం వాటిల్లింది. ఆ సంస్థ సీఈఓ జెన్సన్ హువాంగ్‌పై వచ్చిన వివాదాస్పద ఆరోపణలు, కంపెనీ బోర్డు ప్రారంభించిన అంతర్గత దర్యాప్తు ఇన్వెస్టర్లలో ఆందోళనకు కారణమయ్యాయి. దీంతో అమెరికా స్టాక్ మార్కెట్‌లో సోమవారం ఎన్విడియా షేర్లు 4.27 శాతం పడిపోయాయి. ఈ పతనంతో కంపెనీ మార్కెట్ విలువలో సుమారు 190 బిలియన్ డాలర్లు (రూ.17 లక్షల కోట్లకు పైగా) తగ్గిపోయింది. మార్కెట్ ముగిసే సమయానికి ఒక్కో షేరు ధర 7.97 డాలర్లు తగ్గి 178.67 డాలర్ల వద్ద స్థిరపడింది.

ఒక్కరోజులో 190 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ తగ్గుదల

శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి ఎన్విడియా మార్కెట్ విలువ సుమారు 4.5 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. సోమవారం ట్రేడింగ్‌లో ఒక దశలో షేర్లు 7.5 శాతం వరకు పడిపోవడంతో కంపెనీ మార్కెట్ విలువ భారీగా తగ్గింది. రాయిటర్స్ నివేదిక ప్రకారం.. మార్కెట్ ముగిసే సమయానికి షేరు ధర 4.27 శాతం తగ్గి 178.67 డాలర్లకు చేరింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువలో సుమారు 190 బిలియన్ డాలర్లు ఆవిరయ్యాయి. భారత కరెన్సీలో ఈ మొత్తం రూ.17 లక్షల కోట్లకు పైమాటే.

ఫోర్బ్స్ కుబేరుల జాబితాలోనూ రెండు స్థానాలు పతనం

ఎన్విడియా షేర్ల పతనం జెన్సన్ హువాంగ్ వ్యక్తిగత సంపదపైనా ప్రభావం చూపింది. ఫోర్బ్స్ రియల్‌టైమ్ బిలియనీర్స్ జాబితా ప్రకారం.. నవంబర్ 9న ఆయన సంపద 6.8 బిలియన్ డాలర్లు తగ్గి 155.4 బిలియన్ డాలర్లకు చేరింది. దీంతో ప్రపంచ కుబేరుల జాబితాలో ఎనిమిదో స్థానం నుంచి పదో స్థానానికి దిగజారారు. వారెన్ బఫెట్, లారీ ఎలిసన్ ఆయనను అధిగమించారు. హువాంగ్ సంపదలో ఎక్కువ భాగం ఎన్విడియాలో ఆయనకున్న 3.5 శాతానికి పైగా వాటా నుంచే వస్తోంది. అందుకే షేర్ల ధరలో మార్పులు ఆయన సంపదపై నేరుగా ప్రభావం చూపుతున్నాయి.

ఏఐ పెట్టుబడులపై సందేహాలూ కారణమేనా?

ఎన్విడియా షేర్లపై ఒత్తిడికి హువాంగ్ వ్యవహారంతో పాటు ఏఐ రంగంపై ఇన్వెస్టర్లలో పెరుగుతున్న ఆందోళనలు కూడా కారణమవుతున్నాయి. డేటా సెంటర్ల నిర్మాణం, విద్యుత్ వినియోగం, ఏఐ మౌలిక సదుపాయాలపై భారీగా పెట్టుబడులు పెట్టడం వల్ల ఆశించిన స్థాయిలో లాభాలు వస్తాయా? అనే సందేహాలు మార్కెట్‌లో ఉన్నాయి. మరోవైపు



అమెరికా–చైనా మధ్య చిప్ ఎగుమతులపై ఆంక్షలు, నియంత్రణలు మరింత కఠినమయ్యే అవకాశం కూడా ఎన్విడియాకు సవాలుగా మారవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం కంపెనీకి సంబంధించిన దర్యాప్తు కొనసాగుతోంది. నవంబర్ 17న ఎన్విడియా త్రైమాసిక ఆర్థిక ఫలితాలు ప్రకటించనుంది. ఈ ఫలితాలతో పాటు దర్యాప్తులో వెలువడే అంశాలు కంపెనీ షేర్ల తదుపరి కదలికలను ప్రభావితం చేసే అవకాశం ఉంది.

వివాహేతర సంబంధం.. చైనా గూఢచర్యం ఆరోపణలు

చైనా గూఢచారిగా అనుమానిస్తున్న అలిస్ హువాంగ్‌తో తనకు వివాహేతర సంబంధం ఉందని ఎన్విడియా సీఈవో జెన్సెన్ హువాంగ్ అంగీకరించారు. అలిస్ జెన్సన్‌తో సన్నిహిత సంబంధం ఏర్పరచుకుని ఆ తర్వాత సున్నితమైన సమాచారాన్ని చైనాకు బదిలీ చేసినట్లు వార్తా కథనాలు చెప్తున్నాయి. ఈ వ్యవహారంపై హువాంగ్ తన ఉద్యోగులకు పంపిన సందేశంలో భార్య, పిల్లలను బాధపెట్టినందుకు విచారం వ్యక్తం చేసినట్లు సమాచారం. తాను చేసిన పనికి క్షమాపణలు చెబుతూ.. కంపెనీ దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తానని వెల్లడించినట్లు కథనాలు తెలిపాయి.

ఈ పరిణామాల నేపథ్యంలో ఎన్విడియా బోర్డు స్వతంత్ర డైరెక్టర్లు, బయటి న్యాయ నిపుణులతో కూడిన కమిటీ ద్వారా దర్యాప్తు చేపట్టింది. అయితే జాతీయ భద్రతకు లేదా ఎన్విడియా రహస్య సమాచారానికి ముప్పు వాటిల్లిందని భావించడానికి ఎలాంటి కారణాలు లేవని బోర్డు స్పష్టం చేసింది. హువాంగ్ నాయకత్వంపై తమకు విశ్వాసం ఉందని పేర్కొంది. చైనా విదేశాంగ శాఖ సైతం గూఢచర్య ఆరోపణలను ఖండించింది.

స్పోర్ట్స్

ఇండియా వర్సెస్ న్యూజిలాండ్: ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయిన మూడో వన్డే

భారత్–న్యూజిలాండ్ మధ్య మూడో వన్డేకు వర్షం అంతరాయం కలిగించింది. హామిల్టన్‌లోని సెడ్డన్ పార్క్‌లో మంగళవారం జరగాల్సిన ఈ మ్యాచ్ ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. దీంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 2–0 ఆధిక్యం కొనసాగుతోంది. ఉదయం నుంచి వర్షం కురుస్తుండడంతో టాస్ ఆలస్యమైంది. పలుసార్లు టాస్‌ను వాయిదా వేశారు. మధ్యలో కాసేపు వరుణుడు విరామం ఇవ్వడంతో టాస్ వరకు మార్గం సుగమమైంది. టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. వరుసగా మూడోసారి టాస్ గెలిచిన గిల్.. గత రెండు మ్యాచ్‌ల్లో ఆడిన జట్టుతోనే బరిలోకి దిగాలని నిర్ణయించాడు. మ్యాచ్‌ను 40 ఓవర్లకు కుదించి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే మ్యాచ్ ప్రారంభానికి సిద్ధమవుతున్న



సమయంలో మళ్లీ వర్షం మొదలైంది. కాసేపటికే అది మరింత పెరగడంతో మైదానాన్ని తిరిగి కవర్లతో కప్పేశారు. ఆటగాళ్లు కూడా డ్రెస్సింగ్ రూములకు చేరుకున్నారు. న్యూజిలాండ్ కాలమానం ప్రకారం రాత్రి 7.50 గంటలకు 20 ఓవర్ల మ్యాచ్ నిర్వహించేందుకు తుది గడువు ఉంది. అప్పటికి ఇంకా 70 నిమిషాల సమయం ఉన్నప్పటికీ వర్షం తగ్గే సూచనలు కనిపించకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. మూడో వన్డే రద్దుతో భారత్‌కు సిరీస్‌లో 2–0 ఆధిక్యం కొనసాగుతోంది. మిగిలిన రెండు మ్యాచ్‌ల కోసం ఇరు జట్లు టౌరంగాకు వెళ్లనున్నాయి. నాలుగో వన్డే నవంబర్ 13న బే ఓవల్‌లో, ఐదో వన్డే నవంబర్ 15న జరగనున్నాయి.

ముంబై ఇండియన్స్‌కు అర్షదీప్ సింగ్.. ట్రేడ్ ఖరారు చేసిన తండ్రి!

ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు అతిపెద్ద సంచలనం నమోదైంది. యువ పేస్ బౌలర్ అర్షదీప్ సింగ్ పంజాబ్ కింగ్స్‌ను వీడి ముంబై ఇండియన్స్ జట్టులోకి మారాడు. ఈ భారీ ట్రేడ్‌కు సంబంధించి పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీలు ఇంకా అధికారిక ప్రకటన విడుదల చేయనప్పటికీ, ఈ విషయాన్ని అర్షదీప్ తండ్రి దర్శన్ సింగ్ స్వయంగా ధ్రువీకరించారు. ప్రస్తుతం న్యూజిలాండ్ పర్యటనలో తన కుమారుడితో పాటు ఉన్న ఆయన, ఈ ట్రేడ్‌కు సంబంధించిన అధికారిక సమాచారం తమకు అందిందని ఒక వీడియో ఇంటర్వ్యూలో వెల్లడించారు. దీంతో ఈ ట్రేడ్ దాదాపు ఖరారైనట్లేనని స్పష్టమైంది.

మాకు కూడా ఆశ్చర్యంగానే ఉంది: దర్శన్ సింగ్

ప్రముఖ క్రీడా జర్నలిస్ట్ విమల్ కుమార్‌తో న్యూజిలాండ్‌లో మాట్లాడిన దర్శన్ సింగ్, ఈ ట్రేడ్ గురించి తమకు ముందుగా ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. "ఈ ట్రేడ్ జరిగిందని మాకు కూడా ఆశ్చర్యంగానే తెలిసింది. దీని గురించి మాతో ముందస్తు చర్చలు ఏమీ జరపలేదు. ఇప్పుడు ట్రేడ్ అయినట్లు అధికారిక సమాచారం అందిందని అనుకుంటున్నాను" అని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ ఒప్పందంలో భాగంగా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్‌కు వెళ్తున్నాడా? లేదా? అనే విషయంపై ఆయన ఎలాంటి వ్యాఖ్య చేయలేదు.

పంజాబ్‌ను వీడటం భావోద్వేగంగా ఉంది

పంజాబ్ కింగ్స్‌తో అర్షదీప్‌కు ఉన్న అనుబంధాన్ని దర్శన్ సింగ్ గుర్తుచేసుకున్నారు. "ఒక వ్యక్తి ఎక్కడ పుట్టినా, ఆ ప్రదేశంతో జీవితాంతం ఒక ప్రత్యేకమైన అనుబంధం ఉంటుంది. అర్షదీప్‌కు పంజాబ్ కింగ్స్ అలాంటిదే. ఆ జట్టుతో అతనికి బలమైన బంధం ఉంది. అందుకే ఆ జట్టును వీడాల్సి రావడం కొంచెం భావోద్వేగంగా అనిపిస్తోంది" అని ఆయన అన్నారు. అయితే, ప్రతీ ఫ్రాంచైజీ తమ జట్టు సమతూకం కోసం ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటుందని, వారు కూడా



అందుకు అనుగుణంగానే అర్షదీప్‌ను ట్రేడ్ చేసి ఉంటారని అభిప్రాయపడ్డారు.

ముంబై జట్టులోకి వెళ్లడం సంతోషమే

పంజాబ్‌ను వీడటం బాధగా ఉన్నప్పటికీ, ముంబై ఇండియన్స్ జట్టులోకి వెళ్లడంపై దర్శన్ సింగ్ సంతోషం వ్యక్తం చేశారు. "ముంబై ఇండియన్స్‌లో చేరడం మాకు చాలా ఆనందంగా ఉంది. అక్కడ అతని పాత కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు జస్ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్ వంటి పాత సహచరులు ఉన్నారు. కాబట్టి మేం సంతోషంగా ఉన్నాం" అని వివరించారు. ఐపీఎల్ 2027లో బుమ్రా, అర్షదీప్ కలిసి బౌలింగ్ చేయడాన్ని చూడటానికి తాను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. "ఇక ముంబై బౌలింగ్ అటాక్ అద్భుతంగా ఉంటుంది. ఏ స్కోరునైనా వారు అడ్డుకోగలరు. ప్రత్యర్థి జట్లను 200 పరుగుల లోపే కట్టడి చేస్తారని అభిమానులు అంటున్నారు. ఇది గొప్ప భాగస్వామ్యం అవుతుంది" అని ఆయన అన్నారు. అయితే, ఐపీఎల్‌లో పిచ్‌లు బ్యాటింగ్‌కు అనుకూలంగా (ఫ్లాట్‌గా) ఉంటాయని, అక్కడ ఏమైనా జరగొచ్చని వాస్తవిక దృక్పథంతో వ్యాఖ్యానించారు. ఈ ట్రేడ్ జీతం, ఇతర వివరాలు ఇంకా వెల్లడి కావాల్సి ఉంది.

తండ్రిని తలపించే బ్యాటింగ్.. సెహ్వాగ్ తనయుడి 160 పరుగుల విధ్వంసం



భారత క్రికెట్‌లో మరో యువ సంచలనం వెలుగులోకి వచ్చాడు. విధ్వంసకర బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లను హడలెత్తించిన మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ వారసుడు ఆర్యవీర్ సెహ్వాగ్.. తండ్రి తరహాలోనే మైదానంలో దూకుడు చూపించాడు. అండర్–19 ఆసియా కప్ 2026లో భాగంగా మంగళవారం యూఏఈతో జరిగిన కీలక మ్యాచ్‌లో ఆర్యవీర్ 160 పరుగులతో చెలరేగాడు. 168 బంతులు ఎదుర్కొని భారీ ఇన్నింగ్స్ ఆడాడు. ఈ టోర్నీలో ఇప్పటివరకు ఒక ఇన్నింగ్స్‌లో నమోదైన అత్యధిక వ్యక్తిగత స్కోరు ఇదే. మ్యాచ్ ఆరంభంలో ఆర్యవీర్ ఆచితూచి ఆడాడు. తొలి పరుగులు చేసేందుకు 14 బంతులు తీసుకున్నాడు. క్రీజులో కుదురుకున్నాక మాత్రం ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కీలక మ్యాచ్‌లో అతడి శతకం భారత్‌ను పటిష్ఠ స్థితిలో నిలిపింది. చివరకు 168 బంతుల్లో 160 పరుగులు చేసి ఔటయ్యాడు. 153 పరుగుల వద్దే ఈ టోర్నీలో అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డును అధిగమించాడు. తండ్రి వీరేంద్ర సెహ్వాగ్ తొలి బంతి నుంచే బౌలర్లపై దాడి చేసేవాడు. అయితే ఆర్యవీర్ తన ఆటతీరులో తండ్రి దూకుడుతో పాటు విరాట్ కోహ్లీ నుంచి స్ఫూర్తి పొందుతున్నట్లు గతంలో వెల్లడించాడు. దూకుడుగా ఆడటమంటే తనకు ఇష్టమని, సెహ్వాగ్ శైలితో పాటు కోహ్లీ తరహాలోనూ క్రికెట్ ఆడాలనుకుంటున్నానని చెప్పాడు. ప్రత్యర్థి జట్లపై ఆధిపత్యం చెలాయించి భారత్‌కు విజయాలు అందించడమే తన లక్ష్యమని పేర్కొన్నాడు. దాన్ని ఆచరణలో పెడుతున్నట్లు తాజా ఇన్నింగ్స్‌తో స్పష్టమవుతోంది.



‘ఇట్లు అర్జున’ ఈవెంట్‌లో రామ్ చరణ్ టంగ్ స్లిప్.. ‘కాకా’ మూవీపై బిగ్ అప్‌డేట్!


మహేష్ రెడ్డి తనయుడు అనీష్ హీరోగా టాలీవుడ్‌కు పరిచయం అవుతున్న చిత్రం ‘ఇట్లు అర్జున’. మహేష్ ఉప్పల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు వెంకీ కుడుముల నిర్మాతగా వ్యవహరిస్తుండగా.. కింగ్ నాగార్జున సమర్పిస్తున్నారు. అనస్వర రాజన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీ ప్రమోషన్స్‌ను చిత్ర బృందం జోరుగా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఇటీవల హైదరాబాద్‌లో గ్రాండ్‌గా మ్యూజికల్ కాన్సర్ట్ నిర్వహించారు. ఈ వేడుకకు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ముఖ్య అతిథిగా హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. అయితే ఈ కార్యక్రమంలో చరణ్ చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ‘ఇట్లు అర్జున’ సినిమాలో హీరో అనీష్ మూగవాడి పాత్రలో కనిపించనున్నారు. ఈ విషయాన్ని ప్రస్తావించిన రామ్ చరణ్.. తన కెరీర్‌లో ఎంతో ప్రత్యేకంగా నిలిచిన ‘రంగస్థలం’ సినిమాను గుర్తుచేసుకున్నారు. “రంగస్థలం సినిమాలో నేను చేసిన మూగవాడి పాత్ర కంటే.. ఈ సినిమాలో అనీష్ చేస్తున్న మూగవాడి క్యారెక్టర్ ఇంకా పెద్ద హిట్ అవ్వాలి” అంటూ మనస్ఫూర్తిగా కోరుకున్నారు. అయితే ఇక్కడే చరణ్ నోటి నుంచి చిన్న పొరపాటు దొర్లింది. ‘రంగస్థలం’ సినిమాలో ఆయన పోషించిన చిట్టిబాబు పాత్రకు వినికిడి లోపం ఉంటుంది. అంటే ఆ పాత్ర చెవిటిది కానీ మూగది కాదు. అయితే ప్రసంగం మధ్యలో ఫ్లోలో చరణ్ మూగవాడి పాత్ర అంటూ పేర్కొనడంతో అభిమానులు ఈ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. సరదాగా మీమ్స్ కూడా చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ అనస్వర రాజన్ గురించి కూడా రామ్ చరణ్ ప్రత్యేకంగా మాట్లాడారు. ఆమె నటన అద్భుతంగా ఉందని ప్రశంసించారు. భవిష్యత్తులో టాలీవుడ్‌లో ఆమె మంచి స్థాయికి చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ‘ఇట్లు అర్జున’ సినిమాలో అనీష్, అనస్వర రాజన్ మధ్య వచ్చే సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయని, ఇద్దరి మధ్య కెమిస్ట్రీ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని చరణ్ అభిప్రాయపడ్డారు.అనస్వర రాజన్ ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ డ్రామా ‘కాకా’లోనూ నటిస్తున్నారు. ఈ విషయాన్ని ప్రస్తావించిన రామ్ చరణ్.. తన తండ్రి చిరంజీవిని గుర్తుచేసుకుంటూ సరదాగా వ్యాఖ్యానించారు. “అనస్వర మా నాన్నగారి ‘కాకా’ సినిమాలో కూడా అద్భుతమైన పాత్ర చేస్తోంది. అయితే మా నాన్నగారిలాగా ‘చిరు లీక్స్’ పేరుతో నేను ఆమె క్యారెక్టర్ ఏంటనేది ఇప్పుడే లీక్ చేయను” అంటూ నవ్వులు పూయించారు. ఇక ‘కాకా’ సినిమా విజయంపై రామ్ చరణ్ తన నమ్మకాన్ని వ్యక్తం చేశారు. “ఈ సంక్రాంతికి ‘కాకా’ సినిమాతో మేం పక్కాగా బ్లాక్‌బస్టర్ కొడుతున్నాం” అంటూ ఎంతో కాన్ఫిడెంట్‌గా చెప్పారు. దీంతో అక్కడున్న మెగా అభిమానులు కేరింతలు, అరుపులతో సందడి చేశారు.

వరుస సినిమాలతో విజయ్ సేతుపతి బాక్సాఫీస్ దండయాత్ర.. రెండు నెలల్లో రెండు చిత్రాలు..!



‘బత్తా’ సినిమా విజయంతో మంచి జోష్‌లో ఉన్న కోలీవుడ్ స్టార్ హీరో, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి ఇప్పుడు వరుస చిత్రాలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన.. ఇకపై బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో థియేటర్లలో సందడి చేయబోతున్నారు. ఇప్పటికే ఆయన నటిస్తున్న పలు క్రేజీ ప్రాజెక్టులు విడుదలకు సిద్ధమవుతుండగా, మరికొన్ని చిత్రాలు నిర్మాణ దశలో ఉన్నాయి. ముఖ్యంగా రాబోయే కొన్ని నెలల్లో విజయ్ సేతుపతి సినిమాలు వరుసగా ప్రేక్షకుల ముందుకు రానుండటంతో అభిమానుల్లో ఆసక్తి పెరుగుతోంది. విజయ్ సేతుపతి నటించిన క్రైమ్ థ్రిల్లర్ ‘ట్రైన్’ ముందుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రముఖ దర్శకుడు మిస్కిన్ తెరకెక్కించిన ఈ చిత్రంపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాను గ్రాండ్‌గా విడుదల చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు. మిస్కిన్ తనదైన ప్రత్యేకమైన మేకింగ్ స్టైల్‌తో ఈ సినిమాను రూపొందించినట్లు తెలుస్తోంది. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం విజయ్ సేతుపతి అభిమానులకు ఎలాంటి అనుభూతిని అందిస్తుందో చూడాలి. ‘ట్రైన్’ విడుదలైన కొద్ది వారాలకే విజయ్ సేతుపతి మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. దర్శకుడు త్యాగరాజన్ కుమారరాజా తెరకెక్కిస్తున్న ‘పాకెట్ నావెల్’ (గ్రాశీఎఒ చీశీజవశ్రీ) చిత్రాన్ని పొంగల్ కానుకగా జనవరి 14న విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. విభిన్నమైన కథాంశాలతో సినిమాలు రూపొందించే త్యాగరాజన్ కుమారరాజా, విజయ్ సేతుపతి కాంబినేషన్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఇలా డిసెంబర్, జనవరి నెలల్లో వరుసగా రెండు సినిమాలు విడుదల కానుండటం విశేషం. ఇక విజయ్ సేతుపతి కెరీర్‌లో మరో కీలకమైన ప్రాజెక్ట్ ‘స్లమ్‌డాగ్ 33 టెంపుల్ రోడ్’ (గ్రాశీబఎఒశీస్త్ర 33 ూవఎజూశ్రీవ =శ్రీుఒ). డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించిన డిజిటల్ స్ట్రీమింగ్ హక్కుల విషయంలో ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియోతో చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ డీల్ త్వరలోనే కొలిక్కి వస్తే, సినిమాను 2027 ఫిబ్రవరిలో థియేటర్లలో విడుదల చేయాలని చిత్ర బృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. పూరి జగన్నాథ్ మార్క్ యాక్షన్, విజయ్ సేతుపతి నటన కలిస్తే సినిమా ఎలా ఉండబోతుందనే ఆసక్తి అభిమానుల్లో కనిపిస్తోంది. మరోవైపు విజయ్ సేతుపతి నటిస్తున్న ‘ఇంజి వెల్లం’ సినిమా విడుదల తేదీపై కూడా చర్చ జరుగుతోంది.

రాజమౌళి వారణాసి.. తెలుగు రాష్ట్రాల్లో భారీ డీల్..!



రాజమౌళి–మహేశ్ బాబు కాంబోలో వస్తోన్న మోస్ట్ అడ్వెంచరస్ అండ్ అవైటేడ్ మూవీ వారణాసి. ఈ మూవీలో బాలీవుడ్ భామ ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా కనిపించనుంది. ఇప్పటికే రిలీజైన పోస్టర్స్, గ్లింప్స్ వారణాసిపై అభిమానుల్లో భారీ ఆశలు పెంచేశాయి. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ ఏడాది చివరికీ షూట్ ముగించేలా ప్లాన్ చేస్తున్నారు దర్శకధీరుడు. ఈ నేపథ్యంలోనే వారణాసికి సంబంధించి ఓ క్రేజీ టాక్ నెట్టింట వైరల్‌గా మారింది. ఈ మూవీ థియేట్రికల్ రైట్స్ కోసం భారీ డీల్ కుదిరిందని తెలుస్తోంది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర భాషలకు సంబంధించిన థియేట్రికల్ రైట్స్ భారీ ధరకు అమ్ముడైనట్లు సమాచారం. ఈ మూవీ హక్కులను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ దాదాపు రూ.290 కోట్ల రికార్డ్ ధరకు సొంతం చేసుకున్నారని టాలీవుడ్ లేటెస్ట్ టాక్. అయితే దీనిపై ఎలాంటి అఫీషియల్ ప్రకటనైతే రాలేదు.భాషలు నేర్చుకోండి కాగా.. ఈ చిత్రాన్ని 2027, ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నారు. ఈ చిత్రంలో మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. రాజమౌళి చెప్పిన ప్రకారం ‘వారణాసి’లో రాముడు జీవించిన త్రేతాయుగం సీన్స్ కూడా ఉండనున్నాయి. ఇందులో భాగంగా మహేశ్.. శ్రీరాముడిగానూ కనిపించనున్నాడు.



Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,